# భారతేందు హరిశ్చంద్ర

మదన్ గోపాల్



భారతీయ

TL
10.409 2
B 469 M

భారతేందు హరిశ్చంద్ర ( 1850 – 1885 ) తులసీ దాస్। తదనంతరం, ఆధునిక హిందీ భాషాపితామహుడుగా ప్రఖ్యాతి గాంచిన రచయిత. అతడిని గురించి గ్రియర్సన్ తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరిచాడు : "హరిశ్చంద్ర ఈనాటి భారత దేశ కవులలో సుప్రసిద్ధుడు. ఇతడికన్నా మిన్నగా దేశ భాషలను వికాసపథాన పురోగమింపజేసిన రచయిత దేశంలో లేడేమో".

నాటక ప్రక్రియలో సిద్ధహస్తుడుగా పేరు గడించిన హరిశ్చంద్ర పత్రికా రచనను ప్రోత్సహించటంలో కూడా అంతటి కీర్తినీ గడించాడు. చరిత్రలు, జీవిత చరిత్రలు, వ్యాసరచనలు, పురాణాలు, మొదలైన అనేకానేక ప్రక్రియలలో ప్రశస్తమైన రచనలు చేసిన దిట్ట. కేవలం పద్యరచనలే కాక వివిధ రాగాలలో మూడువేలకు పైగా మధురాతి మధుర భక్తి గీతాలను రచించిన ఘనత కూడా అతడికి దక్కింది. 'ఖడీబోలీ' రచనా ప్రాంగణంలో అడుగుపెట్టగానే 'బ్రజ్ భాష' అంతిమశ్వాస పీల్చడం, తదనంతరం రూపురేఖలు లేకుండాపోవడం జరిగింది. ఖడీబోలీని రచనకు వాహికగా రూపొందించడానికి కాగడాలెత్తిన వారిలో హరిశ్చంద్ర గణనీయుడు.

ముప్పయినాలుగేండ్ల అల్పజీవిత కాలంలోనే భారతేందు ఎన్నో బాటల్ని వెలుగుమయం చేశాడు. అయినా తన స్వంత జీవిత వ్యవహారాలను చక్కబెట్టుకోవడంలో భోగలాలసతకు లోనుకావడం విచారింపదగిన విషయం.

మున్షీ ప్రేమ్‌చంద్ : అతని సాహిత్యసేవ (Munshi Prem Chand : A Literary Biography) అన్న గ్రంథాన్ని రచించిన మదన్ గోపాల్ ఇంగ్లీషు భాష తెలిసినవారికి హిందీ రచయితలను పరిచయం చేయడంలో అగ్రగామి. అతడు భారతేందు హరిశ్చంద్రను గూర్చి ఈ పుస్తకాన్ని వ్రాసి ఆధునిక హిందీ సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడు.

ముఖపత్రం : సత్యజిత్ రే
[illegible] : శ్యామల్ సేన్.

SAHITYA AKADEMI
R REVISED PRICE Rs.15.00

భారతేందు హరిశ్చంద్ర

భారతీయ సాహిత్య నిర్మాతలు

# భారతేందు హరిశ్చంద్ర

మూలం :

మదన్ గోపాల్

తెలుగుసేత :

శ్రీమతి ఎ. లక్ష్మీ రమణ

సాహిత్య అకాదెమీ

న్యూఢిల్లీ

BHARATENDU HARISHCHANDRA — Telugu translation by Smt, A. Lakshmi Ramana of Madan Gopal's monograph in English. Sahitya Akademi, New Delhi, 1981.

SAHITYA AKADEMI
REVISED PRICE Rs.15.00

TL
810.4092
B469M

(C) Madan Gopal

First Edition : 1981

Indian Institute of Advanced Study
117649
17.12.04
SHIMLA

Copies available from :
SAHITYA AKADEMI
Rabindra Bhavan, New Delhi-110 001.

Regional Offices :
Madras-600 018, Calcutta-700 029 & Bombay-400 014.

Library IIAS, Shimla
TL 810.409 2 B 469 M
00117649

Published by Sahitya Akademi, New Delhi
and Printed by Weldun Press, Madras-600 021.

# 1

పందొమ్మిదవ శతాబ్దం మహోన్నతమైన మేధా సంపన్నులు ఉద్భవించిన కాలం. అట్టివారిలో విశిష్ట స్థానాన్ని పొందిన ప్రజ్ఞాశాలి భారతేందు హరిశ్చంద్ర. సంఘ సంస్కర్తగా, సలక్షణ ప్రతిభావంతుడుగా వాసికెక్కిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎందరికో మార్గ దర్శకుడు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్, తిరువనంత పురం యువరాజు హెచ్. హెచ్. కేరళవర్మ, కేశవ చంద్రసేన్, మధుసూదన్ దత్, వంటి సమకాలీన మహానుభావులతో చెలిమి చేసినవాడు. బెంగాలులో ప్రారంభమైన నూతన పోకడలను హిందీలోనికి ప్రవేశపెట్టిన నాయకుడు. ఆధునిక హిందీ భాషకు నాందివచనం పలికి, హిందీ భాషలోని వివిధ శాఖల సాహిత్యానికి అండగా నిలిచిన దిట్ట అతడు. అందుకే అతనికి ఆధునిక హిందీ భాషాపితామహుడన్న పేరు సార్థకమయింది.

తాను రచించిన నాటికలు, హిందీ భాషలోనికి అనువదించబడ్డ సంస్కృత, బెంగాలీ, ఆంగ్ల భాషలలోని అనువాద నాటికలు కలిపి పదునెనిమిదికి పైగా వ్రాసిన గౌరవం అతనికి దక్కటమే కాక, హిందీ పత్రికా ప్రచారంలో కూడా అగ్రతాంబూలం అతనిదే. హిందీ వ్యాస రచనలోనూ, జీవిత చరిత్రల చిత్రీకరణ లోనూ, చరిత్రకు సంబంధించిన పుస్తక రచనలోనూ పేరుగాంచిన వారిలో అతడే ప్రథముడు. అతను కవిగా ప్రసిద్ధిగాంచటమే కాక, వివిధ ఛందస్సులలో 3,000 భక్తి గీతాలను రచించాడు — అంతే కాదు. హిందీ కవులలో ఖడీబోలీని (తరువాత బ్రజ్‌భాష స్థానాన్ని ఆక్రమించుకొన్న) ప్రచారంలోకి తెచ్చిన మొదటి కవి బహుశా ఈతడే కావచ్చు.

జీవిత అవసాన దశలో నవలారచన ప్రాముఖ్యాన్ని గ్రహించిన హరిశ్చంద్ర ఎందరో రచయితలను హిందీ నవలలు వ్రాయమని ప్రోత్సహించాడు. భారత దేశ భాషలలో ఎంతో కృషి చేసిన ప్రథమ విదేశీ రచయిత జార్జిగ్రీసన్ హరిశ్చంద్రను గురించి, 'ఈ నాటి భారత దేశ కవులలో సుప్రసిద్ధుడు, దేశ భాషా వ్యాప్తికి ఇంతకన్నా మిన్నగా కృషి చేసిన కవి మరొకరు లేరేమో' అనటంలో ఎంత మాత్రం ఆశ్చర్యం లేదు. హిందీ సాహిత్య పరిశోధకుడు, చరిత్రకారుడు, యఫ్.ఇ. కేయ్ అదే అభిప్రాయాన్ని బలపరుస్తూ, హరిశ్చంద్ర మొత్తం మీద 175 రచనలు చేశాడనీ (కేయ్ 63 రచనల వివరం వదిలి వేయగా) కేవలం ముప్పై నాలుగు సంవత్సరాలకే ఇంతటి ఘనత సాధించటం అద్భుతమని ప్రశంసించాడు.

# 2

హరిశ్చంద్ర వారణాశిలో ఒక వ్యాపారస్తుల కుటుంబంలో జన్మించాడు. అతడి ముత్తాత సేఠ్ ఫతెహేచంద్, సేఠ్ అమీన్‌చంద్ తొమ్మిది మంది సంతానంలో ఒకడు. ఈతడు మీర్‌జఫార్ అనే వ్యాపారితో కలిసి వ్యాపారంలో (లార్డ్) క్లైవ్ చేత మోసగించబడ్డాడు. ఆ దుర్భరమైన దెబ్బ నుండి సేఠ్ అమీర్‌చంద్ కోలుకోనే లేదు. అదే అతని మరణానికి కూడా కారణమైంది. అతడి కుమారుడు సేఠ్ ఫతేచంద్. తన సోదరునితో కలిసి వారణాశి వచ్చాడు. ఇద్దరు సోదరులూ తమ కుటుంబ గౌరవానికి తగ్గ సంపన్న కుటుంబ కన్యలనే వివాహమాడి ఆర్థిక సుస్థిరతను నిలుపుకున్నారు. వారిద్దరూ ఉమ్మడి కుటుంబంలో కలసి మెలసి ఉండి, కొద్ది కాలంలోనే వారణాశి మహారాజుకు పెట్టుబడిదారులు కూడా అయినారు.

సేఠ్ ఫతేచంద్ మనుమడు గోపాల్‌చంద్ర వ్యాపార విషయాలలో దిట్ట, అతడు వ్యాపారంలోని యుక్తి చాతుర్యాన్ని, కవిత్వపు రక్తి చాతుర్యంతో జోడించి 'గిరిధర్ దాస్' అన్న కలం పేరుతో నలుబది రచనలు చేశాడు. వారి కుటుంబం

ఎంతగనో గౌరవించే వైష్ణవ గురువుల ఉపదేశాల ప్రభావం ఆ రచనలలో కని పిస్తుంది.

భారత దేశంలో పవిత్ర పట్టణమైన వారణాశిలో గోపాల్‌చంద్ర స్ఫుర ద్రూపి అని, ప్రజ్ఞాశాలి అని పేరు గాంచాడు. బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో నిర్వ హించబడే ఆ ప్రదర్శనలలో, అతడి పూదోటలోని పూలకు బహుమతులు లభించాయి. రంగులతో రమ్యంగా అలంకరించబడ్డ నావలలో తేలియాడాలని, పట్టణంలో పేరు గాంచిన గాన కోకిలల స్వరాలు వీనులకు విందుగా వినాలని, శరీరాన్ని పులకింప జేసే నృత్య ప్రదర్శనలు కనుల పండువుగా తిలకించాలని ఉవ్విళ్లూరే వాడు. ప్రతి ఏటా ఒక వారం రోజులపాటు జరిగే బుద్వామంగళ్ ('నౌకా మహోత్సవం') ఉత్సవానికి పట్టణ ప్రజలంతా గంగానదీ తీరానికి తరలి వస్తారు. ఈ ఉత్సవంలో గోపాల్‌చంద్ర కుటుంబం ముఖ్యపాత్ర ధరించేది. వారణాశి మహారాజు కూడా ఇందులో స్వయంగా పాల్గొని ఆనందించే వాడు. వివాహ మహోత్సవంలో పెండ్లి కొడుకు ఎంత ముఖ్యుడో, ఈ తెప్ప తిరణాళ్లలో సేఠ్ ఫతేచంద్ కుటుంబం అంత ముఖ్యం అని మహారాజు అనేక మార్లు చమత్కరించారట. ఆ పోలికలో వాస్తవం లేక పోలేదు: పూర్వం వివాహ శుభ లేఖలు మంగలితో అందజేసే ఆచారం ఉండేది — అదే విధంగా ఈ నౌకా మహోత్సవానికి కూడా జరపబడేది - ఆహ్వానం అందుకొని వచ్చిన వారంతా గులాబీ రంగు తలపాగా చుట్టుకొని, నడుముకు అదే రంగు కండువా బిగించుకొని వచ్చేవారు. వచ్చిన వారిలో ఎవరికైనా ఆ రంగు తలపాగా కానీ, నడుం కండువా కానీ లేకపోతే గోపాల్‌చంద్ర కుటుంబమే వాటిని అందజేసేది. అంతటి ఉదారతకు తగ్గ స్తోమతకూడా వారికుండేది.

కళాకారులకు, రచయితలకు కూడా గోపాల్‌చంద్ర కుటుంబం ఎంతో అండగా ఉండేది. సాయం ఎక్కడ అవసరమైతే అక్కడ అందించి ఆదుకోవటానికి ముందుండే వారు, ఎప్పుడు ఎవరికి ఆతిథ్యమివ్వాలా అని అవకాశం కొరకు ఎదురు చూస్తుండే వారు. బసంత ఉత్సవానికి పిలిచిన వారు, వచ్చిన వారుకూడా పసుపు రంగు దుస్తులు ధరించే వారు. వసంతోత్సవానికి ఆనందోత్సాహాలతో రంగు రంగుల వసంతం జల్లుకునే వారు. హుందాగా సాగిపోయిన కాలమది. భారత కాలగమనం మందగమనంగా సాగినా, శోభాయమానంగా సాగిన కాలమది.

సంపన్నత, నాగరికత రంగరించుకున్న గోపాల్‌చంద్ర కుటుంబీకుల వంటి వారణాశి వాస్తవ్యులే ఆ నాటి సంఘ జీవిత విధానాన్ని ఒక క్రమంలో నడిపించే వారు.

గోపాల్‌చంద్ర 'గిరిధర్ దాస్'కు ఇద్దరు కుమారులు – హరిశ్చంద్ర 1850 సంవత్సరంలోను, గోకుల్‌చంద్ర పదిహేను నెలల తరువాత జన్మించారు. వంశపారంపర్యంగా వస్తున్న వ్యాపారవృత్తిని రెండవ కుమారుడు చేపట్టాడు. మొదటి కుమారుడు తనలో నిబిడీకృతమై ఉన్న నిర్మాణాత్మక శక్తిని హిందీ సాహిత్య వికాసానికి వినియోగించాడు.

హరిశ్చంద్ర జన్మించిన 1850 సంవత్సరం వారణాశి పట్టణ జీవితం ఆసక్తిదాయకంగా ఉండి వుండవచ్చును. వారణాశి హిందువుల పుణ్యక్షేత్రం అవటం వల్ల భారతదేశం నలు మూలల నుండీ ముక్తిని అన్వేషిస్తూ వచ్చే భక్తులకే కాక, వ్యాపారంలో లాభాలు ఆశించి వచ్చే వ్యాపారస్తులకూ, అమాయకులను మోసగించ వచ్చే మాయ సన్యాసులకూ, ఢిల్లీ జాడ్ సంస్థానాలలో నిలువ నీడ దొరకక తల దాచుకో వచ్చిన దళారులకూ అందరికి ఆకర్షణీయంగా ఉండేది. ఆ పట్టణం ఓ వైపు కళాకారులకూ, మరో వైపు పాండిత్యంలోనూ, పౌరోహిత్యంలోనూ నైపుణ్యం గడించిన వారికి ఆశ్రయమిచ్చింది. వారణాశి మహారాజుకు కళాపోషకులుగా పెట్టింది పేరు. మహారాజు ముఖ్య కళా పోషకులుగా ఉండగా - పట్టణంలో పేరు ప్రతిష్ఠలు గడించిన కొందరు సంపన్న గృహస్థులు కూడా కవులను, పండితులను, గాయకులను, నాట్యకళా నిపుణులను, కళావంతులను ఆదరించే వారు. కొన్ని ఆమడల దూరంలో ఉన్న కలకత్తాలో ఎన్ని నూతన విప్లవాలు, విధానాలు రేకెత్తుతున్నా వారణాశి పట్టణం వాటిని పట్టించుకోనట్లుగా సాగిపోతుండేది. రాజారామ మోహనరాయ్ ప్రారంభించిన, బ్రహ్మ సమాజోద్యమ ప్రభావం పురాతన ఆచార సంప్రదాయాలలో ఎన్నో మార్పులు తెచ్చి పెట్టింది; భారతీయ పల్లె ప్రాంతాలపైన కూడా ఆ ప్రభావం పడింది.

1848 సంవత్సరంలో లార్డ్ డల్‌హౌసి రాకతో ఒక శకం ముగిసినట్లే. ఈస్ట్ ఇండియా కంపెనీ పంజాబును కూడా స్వాధీనం చేసుకొని, భారత దేశ ఆక్రమణలో విజయ పతాకమైంది. కలకత్తానుండి ఆగ్రాకు ఒక తంతి వార్తల

యంత్రం నెలకొల్పబడింది. రైలు మార్గం కూడా అప్పుడప్పుడే వేయబడింది. కలకత్తా నుండి ఢిల్లీకి ఒక రహదారి మార్గం వేయబడింది. నదులపై ఓడల రాక పోకలు కూడా ప్రారంభమైనవి. బొంబాయి, మద్రాసు, కలకత్తా పట్టణాలలో విశ్వ విద్యాలయాల స్థాపన ప్రారంభమైంది. హిందూ విధవా వివాహ చట్టం అమలులోకి వచ్చింది. అప్పుడప్పుడే పాశ్చాత్య పద్ధతుల ప్రభావం ప్రజలపైన పడుతోంది.

ఆ పాశ్చాత్య నాగరికతా ప్రభావానికి అందరూ వశులైనట్లే గోపాల్‌చంద్ర కూడా వశుడయ్యాడు. తరువాత హరిశ్చంద్ర ఈ విధంగా వ్రాశాడు: "మా తండ్రి ఆంగ్లభాష అభ్యసించక పోయినా, ఆ నాటి అభ్యుదయ భావాలను బాగా అవగాహన చేసుకో గలిగిన వాడు. మతాచారాల పట్ల సంపూర్ణ విశ్వాసం, వైష్ణవ ఆచారాలపైన పరిపూర్ణ గౌరవం ఉన్నప్పటికీ ఆధునిక దృక్పథం గలవాడు గనుక, విగ్రహారాధన, ఉపవాస దీక్షల వంటి ఆచారాలను పాటించలేదు. థాంప్సన్ గవర్నరుగా ఉన్న సమయంలో, మా తండ్రి, వారణాశిలో నెలకొల్పబడిన ప్రథమ బాలికా పాఠశాలలో, మా సోదరిని చేర్పించారు. ఆ రోజులలో అది చాలా సాహసమైన పని అనే చెప్పవచ్చు. ఎందువల్లనంటే, అలాంటి చొరవను ఆ నాటి పెద్దలు గర్హించే వారు. మా అందరికీ కూడా ఆంగ్ల భాషను అభ్యసింపజేశారు."

గోపాల్‌చంద్ర కుటుంబీకుల నీతి నిజాయితీలకు ఈ క్రింది సంఘటన తార్కాణం. 1857వ సంవత్సరం బ్రిటీష్‌వారు ఎంతో ఆపదలో ఉండగా, వారి అమూల్యమైన వస్తువులను గోపాల్‌చంద్ర గృహంలో భద్రపరిచారు. ఈ సంద ర్భంలో గోపాల్‌చంద్ర కుటుంబీకులకు 48 తుపాకులను, పిస్తోళ్లను బ్రిటీష్ వారిచ్చారు. వాటి సహాయంతో వారు వ్యక్తిగతంగా బ్రిటీష్ అధికారులకు రక్షణ నివ్వగలిగారు. దీనిని బట్టి గోపాల్‌చంద్ర కుటుంబీకులు, ఇటు బ్రిటీషు వారికి అటు వారణాశి మహారాజుకూ కూడా ప్రేమపాత్రులేనని తేటతెల్లమవుతుంది.

1857వ సంవత్సరం, స్వాతంత్ర్య సమరానికి ఏడు సంవత్సరాల ముందే జన్మించిన హరిశ్చంద్ర అమిత తెలివి తేటలతో ఉండేవాడు. తన చిలిపి చేష్టలతో ఇరుగు పొరుగు వారిని ఆటలు పట్టించే వాడు. చీకటిలో మెరిసే భాస్వరంతో గోడలపైన బొమ్మలు గీసి రాత్రి వేళల పిరికి వాళ్లను భయపెట్టేవాడు.

ఆ కాలంలో సంపన్న కుటుంబీకుల పిల్లలను ఉర్దూ, పారశీ భాషలలో విద్యా బోధన చేసే పాఠశాలలకు పంపేవారు. హరిశ్చంద్రను కూడా అదే విధమైన పాఠశాలలో చేర్పించటం జరిగింది. ఉర్దూ, ఫారశీ భాషలతో పాటు ఆంగ్ల భాష కూడా బోధించేవారు. హరిశ్చంద్రకు ఆంగ్లం బోధించిన వారిలో రాజాశివ్ ప్రసాద్, 'సితార — యే - హింద్' ఒకరు, నంద్‌కిషోరి మరొకరు. తరువాత నంద్‌కిషోరి ఇంగ్లాండులో గతించాడు. హరిశ్చంద్ర జ్ఞాపకశక్తి అమోఘమని అందరూ ప్రశంసించిన వారే.

హరిశ్చంద్ర తండ్రినుండి రచనా పాటవాన్ని సంతరించుకున్నాడు. బ్రిజ్ భాషలో పద్యాలను వివరించే నైపుణ్యమే కాకుండా ఆ భాషలో కవితను చెప్ప నేర్చాడు. అంతేకాదు, అతడు నవరసాలను నూతనంగా వింగడించినట్లు, ఆ వింగడింపును ఆలంకారికులు అంగీకరించినట్లుకూడా చెప్పుతారు.

ఆ రోజులలో బాల్య వివాహాలు జరగటం సర్వ సాధారణం. చిన్న వయస్సులో మరణించటం కూడా తరచుగా జరిగేది. హరిశ్చంద్ర వంశంలోని పూర్వీకులంతా దాదాపు పది పన్నెండు సంవత్సరాలకే వివాహితులైనవారు. గోపాల్‌చంద్ర విషయం అందుకేమీ భిన్నం కాదు. అతని మొదటి భార్య (అనగా హరిశ్చంద్ర తల్లి) చిన్న తనంలోనే మరణించింది. అప్పటికి హరిశ్చంద్ర అయిదేళ్ళ బాలుడు. గోకుల్‌చంద్ర మూడున్నర సంవత్సరాల పిల్లవాడు.

గోపాల్‌చంద్ర తిరిగి వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత కొద్ది కాలంలోనే తన ఇద్దరు కుమారుల ఉపనయన ఉత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశాడు. భంగ్ పానానికి దాసుడైన 27 సంవత్సరాల గోపాల్‌చంద్ర దురదృష్ట వశాత్తు ఆ పానీయం మితి మీరి సేవించటం వల్ల వడుగు ఉత్సవం జరుగుతున్న సమయంలోనే మరణించాడు. హరిశ్చంద్ర ఆ విషయాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఇలా అన్నాడు:

> నుదుట తిలకం దిద్దుకొని, వెనక ఒక పెద్ద దిండుకు ఠీవిగా ఆనుకొని కూర్చున్నాడు మా తండ్రి. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ ముఖమండలం ఈ నాటికీ నా మనోనేత్రాలపై చెరగని ముద్ర వేసుకుంది. అతనిలో మచ్చుకైనా అనారోగ్యఛాయలు అగుపించలేదు.... —నా

సోదరుడూ నేనూ అక్కడే ఉన్నాము. మా ఇద్దరినీ చూచి, అతడు హఠాత్తుగా ఇలా అన్నారు - 'శీతలా ని బాగ్ మోడ్ దీ హై; అచ్చా అబ్ లేజావ్.'

అప్పటికి పిల్లలు చాలా చిన్నవారు. వారి సవతి తల్లి మోహన్ బీబీ కూడా ఏమంత పెద్దది కాదు. ఇంటి పెత్తనం బంధువులలో ఓ పెద్దమనిషి చేపట్టాడు.

క్వీన్సు కాలేజీలో చదువుతున్న హరిశ్చంద్ర స్థిమితం లేనివాడుగా ఉండే వాడు. క్రమశిక్షణకు లొంగివుండే స్వభావం కాదతడిది. గోపాల్ చంద్ర మరణం తన్ను కట్టి పెట్టిన బంధాలను త్రెంపి స్వేచ్ఛనిచ్చినట్లు భావించాడు. మారుటి తల్లి వద్ద నుండి గాని, తదితరుల వద్దనుండి గాని హరిశ్చంద్రకు అనురాగం లభించ లేదు. ఇతడు చేసే దుబారా ఖర్చు వారికి గిట్టలేదు. సవతి తల్లి అన్న పేరు సార్థకం చేసుకుంటూ డబ్బు ఇచ్చే దగ్గర చాలా పిసినిగొట్టుగా వ్యవహరించేది. నౌకా మహోత్సవం వంటి పర్వ దినాలకు కూడా డబ్బు ఇవ్వటానికి ఇష్టపడేది కాదు. ఆ కారణంగా హరిశ్చంద్రకు అప్పులు చెయ్యటమే శరణ్యమైంది. అప్పుడు చేసిన గోరింత అప్పులే కొండంతలై కూర్చునేవి. అతను ఒంటరివాడై దిగాలు పడి పోవటంలో ఆశ్చర్యం లేదు.

ఈ ఇక్కట్లకుతోడు హరిశ్చంద్రకు పదకొండేండ్లు వచ్చేసరికి పెండ్లి చేసు కొమ్మని వత్తిడి ఎదురైంది. వివాహం చిన్న తనంలోనే జరిగి పోయింది. అతని తండ్రికీ, తాతకూ, ముత్తాతకూ అదే విధంగా జరిగి పోయింది గనుక అదేమీ వారి కుటుంబానికి కొత్త కాదు.

హరిశ్చంద్ర చదువు మధ్యలోనే ఆగిపోయింది. అతని వివాహం కొన్ని కొత్త బాధ్యతలను అంటగట్టినా, కొన్ని కొత్త అవకాశాలకు కూడా దారిచూపింది. ఆ తరువాత జగన్నాథస్వామిని దర్శించటానికి పూరీ యాత్రకు బయలుదేరాడు. ఈ యాత్ర మూలంగా అతడికి నూతన అవగాహనకు అవకాశం లభించింది. నూతన ప్రదేశాలు దర్శించాలన్న ఆసక్తి పెరిగింది. ఆ తరువాత అతను చేసిన యాత్రలకు నాంది అది.

విద్యాభ్యాసం, విజ్ఞానార్జనలోని విశిష్టతను హరిశ్చంద్ర తొందరలోనే గ్రహించ గలిగాడు. ఆ జ్ఞానోదయం, తన స్వగృహంలోనే బీద పిల్లలకు పాఠశాల

ప్రారంభించటానికి తోడ్పడింది. ఆ బడిలో పిల్లలనుంచి జీతాలు తీసుకోబడేవి కావు; పుస్తకాలు కూడా ఉచితంగా ఇవ్వబడేవి.

## 3

హరిశ్చంద్ర కుటుంబ బాధ్యతలు నిర్వహించే యజమాని కావటంతో, ఆడంబరంగా ఖర్చుపెట్టే అవకాశం కూడా లభించింది. అతనికి సువాసన ద్రవ్యాలన్నా, రంగు రంగుల దుస్తులన్నా, విలువైన పీతాంబరాలన్నా ఎంతో మక్కువ. ఉదకమండలం, లక్నో, మొగలాయి దర్బారులలో అత్తరు మొదలైన సుగంధ ద్రవ్యాలు అమ్మే వ్యాపారులకు గిరాకి తగ్గి పోయింది. అయినా హరిశ్చంద్ర వంటి సంపన్నుల గృహాలకు వెళ్లినపుడు సంతృప్తిగా తిరిగి వెళ్లేవారు. అతను అత్తరు పైన చేసే వ్యర్థమైన ఖర్చు విపరీతంగా ఉండేదని అంచనా. తమలపాకులలో వాడే ప్రత్యేకమైన సెంటు ఖర్చు అలవి కానిదిగా ఉండేదనీ, నిత్యమూ వాడే తమలపాకుల ఖర్చే కొన్ని వందల వరకూ ఉండేదనీ వినికిడి. అతను వాడే సెంటు సువాసన చుట్టూ గుబాళించటం వల్ల, సెంటు తయారు చేసే యంత్రం నుండి అప్పుడే ఆ సువాసన వెల్వడిందా అన్నంత ఘాటుగా ఉందని అతని సన్నిహితులు చమత్కరించటం కూడా కద్దు. అతను ఎప్పుడూ మహారాజువలె ముస్తాబు అయ్యేవాడు. వ్యాపారస్తులను, కళాకారులను ఆదరించి పోషించే వాడు. హరిశ్చంద్ర తండ్రి తన తనయులకు మంచి పుస్తక భాండాగారం వదిలి వెళ్లాడు. వివిధ ప్రాంతాలనుండి అమ్మకానికి వచ్చిన అపురూప చిత్రాలు, చిత్ర సంపుటాలు, పురాతన పుస్తకాలు, వ్రాత ప్రతులు మొదలైన వాటిని ఎంతో డబ్బు వెచ్చించి కొని తమ పుస్తక భాండాగారంలో చేర్చేవాడు. పురాతన వస్తువుల పైన అతనికున్న అభిరుచి, అనాదిగా కళాకారులను పోషించే సంప్రదాయం గల కుటుంబ గౌరవాన్ని నిలుపుకోవాలన్న తాపత్రయమూ ఈ అపారమైన ఖర్చుకు కారణం. స్వదేశీయులు, విదేశీయులు కూడా హరిశ్చంద్ర గృహానికి అతిథులుగా

ఇచ్చేసేవారు. కుటుంబ గౌరవానికి లోటు రాకుండా వారందరినీ ఘనంగా సత్కరించి పంపేవాడు.

ఆధునికత ఏ రూపంలో ప్రత్యేకమైనా అతని హృదయాన్ని ఇట్టే ఆకర్షించేది. గడియారాలంటే అతనికి ఎంతో మక్కువ. ఒకే మారు పెద్ద మొత్తంగా కొని, తన చుట్టూ స్తోత్రాలు చేస్తూ తిరిగే వందిమాగధులకు బహూకరించే వాడు. భారత దేశానికి అప్పుడప్పుడే కొత్తగా వచ్చిన ఫొటోలు తీసే పరిశ్రమ వైపు అతని అభిరుచి మొగ్గి, ఆ పరిశ్రమలో దిగిన ఎందరికో పెట్టుబడి పెట్టి జీవనోపాధి కల్పించాడు. అదే విధంగా హోమియోపతి వైద్యంకూడా అతని దృష్టిని ఆకర్షించింది. నెలకు నూటఇరవై రూపాయల ఖర్చుతో ఉచిత చికిత్సాలయం నెలకొల్పాడు.

లితో - ముద్రణా విధానం కూడా వారణాశికి కొత్తగా వచ్చింది. ఈ నూతన ముద్రణా విధానం ఆధారంగా చేసుకొని, హరిశ్చంద్ర తన తండ్రి పుస్తకాలను అచ్చు వేయించాడు. 'సుందరీ తిలక్' అన్న పేరుతో ప్రఖ్యాత కవుల కవితా సంకలనం కూడా ప్రచురించాడు. ఆ రోజుల్లో వారణాశికి ముద్రణాలయాలు కూడా నూతనంగా వచ్చినవే. స్నేహితులకు ఆర్థిక సహాయం చేసి ముద్రణాలయాలు ప్రారంభించటానికి తోడ్పడ్డాడు. నిఘంటు నిర్మాణానికి కానీ, కుస్తీ పోటీల ఏర్పాటుకు కానీ, ఇంద్రజాల ప్రదర్శనకు కానీ, మరే నూతన ప్రదర్శనకు కానీ హరిశ్చంద్ర సహాయ సహకారాలు తప్పని సరిగా లభిస్తవి. ఎటువంటి ఆపదలో ఉండి సహాయం కోరినా తన వద్ద ఉన్న మొత్తం ముట్టజెప్పే స్వభావం అతనిది. ఆ దానం ఇచ్చేటప్పుడు చేతి ఉంగరాలు, రవ్వలు కూడా లెక్క చెయ్యకుండా ఇచ్చివేసేవాడు. ఒక మారు చలిలో వణికిపోతున్న బిచ్చగానికి తన విలువైన శాలువా ఇచ్చి వేశాడు. ఆపదలో ఉన్న బ్రాహ్మణునికి తన వజ్రాల ఉంగరం దానం చేశాడు. తన వెండి పెట్టె చూసి ముచ్చట పడ్డ ఒక బాలుని తండ్రికి ఆ విలువైన వెండి పెట్టెను బహూకరించిన ఉదార స్వభావుడు హరిశ్చంద్ర.

రూపం, ధనం పుష్కలంగా ఉన్న నవయౌవనుని చుట్టూ వందిమాగధులు, అవకాశవాదులు మూగటం సహజం. అటువంటి వారంతా అతని శ్రేయోభిలాషులుగా చలామణి కాజూసే వారు.

బహుశా హిందీ భాషలో ప్రథమంగా వచ్చిన స్వీయచరిత్ర వ్యాసంలో హరిశ్చంద్ర తన చుట్టూ వ్యక్తుల మనస్తత్వ విమర్శే కాక, ఆనాటి పరిస్థితులను, అతీత స్మృతులను ఉల్లేఖిస్తూ ఇలా వ్రాశాడు :

నేను ఓ కిటికి దగ్గరగా కూర్చుని బయట తిలకిస్తు ఆనందిస్తున్నాను. అది వసంత ఋతువు. హాయిని గొలిపే చల్లని గాలి వీస్తుంది. సంధ్యా సమయం, ఓ ప్రక్క సూర్యుడూ, మరో దిశలో చంద్రుడూ లేత ఎరుపు రంగులో గోచరిస్తున్నారు, కనుల పర్వంగా ఉంది.

పూలమ్మేవారు 'పూలో' అనీ, చెరుకు ముక్కలు అమ్మేవారు 'చెరుకు గడలో' అనీ, కేసరి అమ్మేవారు 'కేసరి' అనీ కేకలు పెడుతూ వీధివెంట వెళ్లుతున్నారు, యౌవనపు స్వప్నాలలో, ప్రేమ జగత్తులో విహరిస్తూ, ప్రణయ నిషాలో మునిగి తేలుతున్న నాకు కాలగమనమే తెలియకుండా నడుస్తున్నది. నేను వయస్సుకు చిన్నవాడినయినా, నన్ను నిజంగా ప్రేమించే వారెవరో, వందిమాగధులెవ్వరో తెలుసుకునే విచక్షణాజ్ఞానం లేని అమాయకుడను మాత్రం కాను. నా చుట్టూ చేరిన భట్రాజుల పొగడ్తలు పలు తీరులుగా ఉండేవి. 'నీ అంతటి స్ఫురద్రూపి ప్రపంచం అంతా గాలించినా ఉండరు'; అని ఒకరంటే ...'నీఅంతటి మహామేధావిని నేను కనీవినీ ఉండలేదు' అని మరొకరు; 'చమీలీజాన్‌కి నీవంటే ఎంత మోహావేశమో చెప్ప నలవికాదు. నిన్ను చూడకుండా అసలామె బ్రతకనేలేదు' అని మరొకరు; 'ఓహో భగవంతుడా! నీవు అల్లిన పద్యం ఎంత అద్భుతంగా ఉందయ్యా! అది చదివి మేము ఎంతగా చలించిపోయామంటే, రాత్రి కునుకైనా పట్టలేదంటే నమ్ము'; అంటే వెంటనే ఇంకొక పొగడ్తలరాయుడు అందుకున్నాడు,... 'ప్యారీ! నీవు రచించిన ఫలానా గజల్ ఆలపించేసరికి, శ్రోతలంతా పొట్టలు చెక్కలయ్యేలా నవ్వీ నవ్వీ ఆనందించారనుకో' .... అందులో ఒకరన్నారు, 'ఆ పరమాత్ముడు నిన్ను చల్లగా చూడాలి, నిజంగా నీవు మహాత్ముడివి, నిజానికి నీ గురించి మనసులోని భావాలు చెప్పటానికి మాటలు చాలవు సుమీ' .... అక్కడ చేరిన నాల్గవ వ్యక్తి అన్నాడు, 'నీ వ్రేలికి ఉన్న ఉంగరంలో రాయి ఏమిటి? అది వజ్రమా లేక మంచుతునకా అని భ్రమ కలుగుతుంది'... పక్షుల ప్రియుడు మీర్‌సాహెబ్ ఇంకో దండకం వల్లించేవాడు, 'నీవు పెంచే పావురాలతో పోటీకి ఏ పక్షులూ నిలవలేవు. అబ్బా! అవి పావురాలా లేక దివినుండి భువికి దిగివచ్చిన

దేవదూతలా అని భ్రమ కలుగుతుంది. పురాణాలలో పేర్కొనిఉన్న హ్యూమా పైన వాటి నీడ సోకినా అవి గరుడపక్షులుగా మారిపోవూ! — నిజానికి క్రైస్తవులు ఇటువంటి అపురూపమైన జీవులలోనే భగవత్ స్వరూపాన్ని దర్శించారు. అవి అలా పైపైకి గగనవీథుల్లోకి ఎగిరిపోతుంటే మనస్సు వికసిస్తుంది. భగవంతుని మీద ప్రమాణంచేసి చెబుతున్నాను, ఇంత అందమైన పక్షులను మరెవ్వరూ కలలోనైనా చూచి ఉండరు'; మరోమాటకారి నా గుఱ్ఱాలను అతిగా పొగిడేవాడు. ఇంక, కంసాలి నా కంచర గాడిదనుకూడా మెచ్చుకునిపోయేవాడు, బట్టలవర్తకుడు నా పూదోటను పావనమని పొగిడి, అందులోని పూలను దేవదేవుని పూజార్థం పట్టుకెళుతున్నానని చెప్పి మరీ పట్టుకెళ్ళేవాడు! .... ఈ పొగడ్తలన్నీ నాకొరకే. నిజానికి నేను కాబట్టి ఆ జోరుకు తట్టుకున్నాను గాని, ఆ పొగడ్తల కుంభవృష్టికి కృంగిపోవలసిందే. మా కచ్చేరీ గదిలో జరిగిన తంతు అది, అవి అన్నీ నీటి బుగ్గలులా చల్లగా జారిపోయేవి.

ఇంక మెట్లగది దగ్గర తతంగం చూద్దాము. నలుగురయిదుగురు హిందువులు, మహమ్మదీయులు, కావలివారు, జమాదారు, ఇద్దరు ముగ్గురు ఉద్యోగాల కొరకు ప్రాకులాడుతూ వచ్చినవారు, ఇంకా ఎందరో చిల్లరమల్లర పనులకు వచ్చిన వాళ్లు - అంతా కలగలుపుగా ఉండేవారు, కొందరు నిలబడి, మరికొందరు కూర్చుండి వేచిఉండేవారు, కానీ అందరిదీ ఒకే అభ్యర్థన, అదే డబ్బు అభ్యర్థన.

అయితే ఇక్కడ ఒక్క విషయం మాత్రం వివరించక తప్పదు. అది ఏమిటంటే — ఆ విధంగా పడిగాపులు పడిఉండే వారంతా స్వార్థపరులు అని చెప్ప వీలుకాదు. చాలా అరుదుగా అయినా అందులో కొద్దిమంది యజమానినైన నాయందు భక్తిప్రపత్తులు కలవారుకూడా ఉండేవారు. ఒకడు అక్కడున్న తార్పుగానితో బేరాలు మొదలుపెట్టేవాడు, 'రూపాయిలో రెండణాలవంతు నాకు ముట్టజెప్పు, లేకపోతే నీవు అంతులేకుండా పోతావు చూసుకో. నీవు వెనక వేసుకువచ్చే బీబీజాన్ యీ దర్బారు ద్వారమైనా దాటిరాలేదు.' అని బెదిరించేవాడు, బట్టల వ్యాపారితో మరో లంచగొండి ధీమాగా 'ఆ నల్ల శాలువా నాకు బహూకరిస్తే సరే సరి, లేదా నీకు ముట్టవలసిన పైకంకోసం సంవత్సరాల తరబడి వేలాడుతూ కూర్చోవలసిన గతి పడుతుంది, డబ్బుసంగతి అటుంచి ఇక్కడ ధూళికూడా దక్కదు తెలుసుకో', అని దులిపేసేవాడు.

మధ్యవర్తి ఒకడు తన ప్రతాపం వెలగబెడుతూ తాను అయ్యగారి తలలోని నాలుక అని విఱ్ఱవీగుతాడు. అప్పులన్నీ ఇప్పించేవాడిని నేనే!

మరింకో ఘనుడు తన దర్పం చూపిస్తూ 'నా దగ్గర తలెత్తటానికి నీకెన్ని గుండెలు? ఆడవాళ్లకందరికి డబ్బు పంచేవాడిని నేనే; ఏమనుకుంటున్నావో ఏమో!' అని డాబుగా అంటాడు.

''వీరందరిలో నిజంగా మీకు ఉపయోగపడే వాడికొరకు చూడండి. (హరిశ్చంద్ర అతడెవరని చిన్న సూచన చేశాడు.) అతను కులానికి కుమ్మరి, సామాన్యమైన ఎత్తు, చిన్న కళ్లు, పెద్ద మీసాలు, బలమైన చేతులు గల నల్లని మనిషి, ఎర్రని తలపాగా చుట్టుకొని, ఆకుపచ్చని నడికట్టు కట్టుకొని, తెల్ల శాలువామాత్రం కప్పుకొని ఉంటాడు. ఈ మధ్య నాకు అతను సన్నిహితుడైపోయాడు. అందువల్ల నాతో పనిబడ్డ వాళ్ళంతా అతనిని ఉపయోగించుకుంటూ ఉంటారు.''

హరిశ్చంద్ర భార్య మన్నోదేవివల్ల ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. కుమారు లిద్దరూ చిన్నతనంలోనే గతించారు. మిగిలిన ఒక్క బిడ్డకు అనారోగ్యం వెంటబెట్టుకునే ఉండేది, తల ఒక ప్రక్కకు ఒరిగి ఉండేది. హరిశ్చంద్ర వివాహ జీవితం అన్యోన్యమైనది కాదు. వారి ఇంటికి తరచుగా వెళ్లే వైద్యుడు, ఆ ఇంటి పరిస్థితులను గమనించి, మన్నోదేవి మనోవేదనకు, ఆమె అనారోగ్యానికి కూడా ముఖ్యకారణం, భర్త ఆమెపట్ల చూపే అనాదరణే అన్న అభిప్రాయం వెలిబుచ్చాడు,

ఇటువంటి సున్నితమైన విషయాలు ఎదుటపడి ముఖాముఖిని మాట్లాడే కన్నా, ఉత్తరం ద్వారా తెలియజేయాలని వైద్యుడు బెంగాలీలో ఒక ఉత్తరం వ్రాశాడు. హరిశ్చంద్ర ప్రత్యుత్తరం బెంగాలీలో (దేవనాగరి లిపిలో) ఇచ్చాడు. అందులో అతను తనకు స్వగృహంలో సుఖంలేదనీ, ఆ కారణంగా తన భార్యకు ఎటువంటి ఇబ్బందినీ కలిగించటం లేదనీ, ఆమెకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తూనే ఉన్నాననీ వివరించాడు, అయితే తన హృదయాన్ని అదుపులో పెట్టుకోగల శక్తిసామర్థ్యాలు తనకు అంతగా లేవనీ, అందుకే తాను 'అసహాయుడ' ననీ దాపరికం లేకుండా చెప్పాడు.

1870 వ సంవత్సర ప్రాంతంలో వారణాశిలోని సంపన్న గృహస్థులు, వారికున్న వసతి గృహాలనుబట్టి, వారి అనుగ్రహానికి పాత్రులైన కళావంతులను బట్టి తదితర ఆడంబరాలనుబట్టి వారి అంతస్థులను అంచనా వేసుకొనేవారు. హరిశ్చంద్ర ఈ విలాస విహారాలలో ఏమీ తీసిపోలేదు. హరిశ్చంద్ర భార్యను ఆదుకోవటానికి ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు ఉండటంవల్ల అతను స్వేచ్ఛానందాలు బయటనే అన్వేషించే అవకాశం చిక్కింది.

హరిశ్చంద్ర కళావంతుల గృహాలను తరచు సందర్శిస్తూ ఉండేవాడు. ఈ వృత్తిలోని స్త్రీలు అతని వసతి గృహానికి తరచు వచ్చి వెళ్లేవారు, వీరుకాక, హరిశ్చంద్ర సాహిత్యంలోనూ, జీవితంలోనూ చోటుచేసుకొన్న ఇద్దరు వనితలున్నట్లుగా తెలియవస్తుంది, మొదటి అమె ఆలీజాన్. ఆమెచేసిన అప్పు తీర్చేనిమిత్తం ఆమె గోకుల్‌చంద్ర, హరిశ్చంద్ర గృహానికివస్తూ ఉండేది - అప్పు చెల్లించటానికిగాను ఒక ఇల్లు గోకుల్‌చంద్రకు వ్రాసిఇచ్చింది-ఆ సందర్భంగా ఆమెకు హరిశ్చంద్రతో పరిచయం ఏర్పడింది. అనివార్య కారణాలవల్ల, ఆమె మహమ్మదీయ మతం పుచ్చుకుంది.

హరిశ్చంద్ర తిరిగి ఆమె మతాన్ని మార్చి, మాధవి అన్న హిందువుల పేరుపెట్టి తన అండన చేర్చుకున్నట్లుగా తెలియవస్తున్నది. గోకుల్‌చంద్రకు ఆమె ఇల్లు తాకట్టుపెట్టి దానికి వడ్డీ కట్టుకునే 1870 వ సంవత్సరం సమయంలో హరిశ్చంద్రతో పరిచయం అయి ఉండవచ్చునని అంచనా. ఆ సమయంలో హరిశ్చంద్రకు ఆమెతో పరిచయం పెరిగి, ఆమెను తనదానిగా స్వీకరించవలసిన పరిస్థితి ఏర్పడింది. హరిశ్చంద్ర ఆవిధంగా మాధవి ఇంటనే దర్బారుపెట్టి రేయనక పగలనక ఆమె సన్నిధిలోనే కాలము గడిపేవాడు. దంతపు చెక్కల వంటి అలంకార వస్తువులతో ఆమె గృహాన్ని అలంకరింపజేశాడు, ఠాకూర్‌జీ ప్రతిమ ఆమె ఇంటనే ప్రతిష్ఠింపజేశాడు కూడాను. హరిశ్చంద్ర మరణించిన తరువాత గోకుల్ చంద్ర ఆమెవద్దనుండి వాటన్నింటినీ తిరిగి తెచ్చుకున్నాడు. ఆమెకు నెలకు పది రూపాయల చొప్పున మాత్రం ముట్టజెబుతూ వచ్చాడు. గోకుల్‌చంద్ర మరణంతో అదికూడా ఆమెకు దక్కకుండా పోయింది.

కొన్ని సంవత్సరాల తరువాత మల్లిక అనే బెంగాలీ వితంతువుకూడా హరిశ్చంద్ర జీవితంలో ప్రవేశించింది. మల్లికపట్ల హరిశ్చంద్రకు ప్రగాఢమైన అను

రాగం ఏర్పడింది. ఆమెకు కొంత సాహిత్యాభిరుచికూడా ఉండేది. ఆమె కొన్ని గేయాలు రచించింది. మూడు బెంగాలీ నవలలను హిందీలోకి అనువదించింది. మల్లిక, హరిశ్చంద్రకు రచనా వ్యాసంగాలలో తోడ్పడుతూ ప్రచురణాలయం ప్రారంభించింది, ఆ ప్రచురణాలయంలో హరిశ్చంద్ర పుస్తకాలు విక్రయించబడేవి. ఆ అనువాదాలలో ఒకదానిని హరిశ్చంద్రకు అంకితమిస్తూ, తాను ఆరాధించే 'ప్రభువు' ప్రోత్సాహంతోనే తానా రచన చేశానని పేర్కొన్నది. హరిశ్చంద్ర ఆర్థికసహాయం అందించి ఆమె పుస్తకాలు ప్రచురించాడు.

'భారతేందు' అన్న ముందుపేరు హరిశ్చంద్ర నడవడికను అనుసరించి సంక్రమించినదే. చివరికది చిరస్థాయిగా మిగిలిపోయింది. హరిశ్చంద్ర ఒకమారు ఒక పెద్దమనిషిని ఎగతాళి పట్టించాడు, అది విన్న తన స్నేహితుడు సున్నితంగా మందలిస్తూ, "నీ నడవడిక అంత నిర్మలమైనదని చెప్పగలవా? నీ ప్రవర్తన, నిజానికి చంద్రుని పోలినది. చంద్రునిలో మచ్చలున్నట్లే నీ ప్రవర్తనలోకూడా ఉన్నవి. అందుకే నిన్ను 'భారతేందు' (భారత చంద్రుడు) అనవచ్చును' అన్నాడు. హరిశ్చంద్ర తనకెలాంటి అభ్యంతరమూ లేదని ఒప్పుకున్నాడు. ఆ విధంగా మొదలైన ఆ పేరు సార్థకనామంగా ఆతని పేరుకు జతపరచబడింది. అతడి స్నేహితులంతా అదే పేరుతో పిలవటం ప్రారంభించారు. 1870–80 సంవత్సరాల మధ్య హరిశ్చంద్ర వివిధ హిందీ సాహిత్య శాఖలలో ప్రఖ్యాత రచయితగా పేరుగాంచాడు. హిందీ రచయితలలో ప్రముఖులు హరిశ్చంద్రను బ్రిటిష్ ప్రభుత్వంవారు గౌరవించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వారి అభిమతాన్ని బ్రిటీష్ ప్రభుత్వంవారు లెక్కచేయకపోవటంతో, వారి అభిమానం దెబ్బతిన్నట్లయినది. గోరుచుట్టుపై రోకటి పోటు వలె అతని ప్రత్యర్థి రాజాశివప్రసాద్ 'సితార - యే - హింద్', ప్రభుత్వం వారి ఆదరాభిమానాలు చూరగొనటం మరింత బాధాకరంగా తోచింది. బ్రిటీష్ రాజ్యం హరిశ్చంద్రను గౌరవించినా లేకపోయినా, హిందీ సాహితీ ప్రపంచం అతనికి 'భారతేందు' (భారత చంద్రుడు) అన్న బిరుదు ప్రసాదించి గౌరవిస్తుందని సగర్వంగా చెప్పినవారిలో కలకత్తాలోని సారసుధానిధి పత్రికా సంపాదకులు ఒకరు. ఆ అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు. హాస్య ధోరణిలో స్నేహితుడు పేర్కొన్న ఆ పేరు చివరకు స్థిరపడిపోయింది. జార్జి గ్రీసన్, గార్కిన్ డిటాసీ వంటి పాశ్చాత్య ప్రముఖులుకూడా హరిశ్చంద్రను సంబో

ధించినపుడు అదే పేరుతో వ్యవహరించారు. హరిశ్చంద్రకుకూడా ఆపేరు బాగా నచ్చినట్లుంది, తన లేఖాపత్రాలపైన చంద్రోదయం గుర్తు అచ్చువేయించుకున్నాడు.

# 4

హరిశ్చంద్ర తన పేరుకు ముందు 'భారతేందు' అన్న బిరుదును పెట్టుకోవడానికి గర్వించేవాడు. పురాణ ప్రసిద్ధుడైన సత్య హరిశ్చంద్రుని పేరే తన పేరు కావడానికికూడా అతను మురిసిపోయేవాడు. భరతేందుడు ఒక రాజులా ఉదారస్వభావుడిగా ఉండ ప్రయత్నించడమే గాక సత్యమనే ధర్మాన్ని అన్నిటికన్నా మిన్నగా పాటించాలని పాటుపడ్డాడు కూడాను. సయ్యద్ అహమద్ ఖాన్ (ఆ తరువాత ఆలిఘఢ్ విశ్వవిద్యాలయం స్థాపించినవారు) లఘు వివాద న్యాయస్థానానికి, న్యాయమూర్తిగా వారణాశి బదిలీ అయివచ్చినప్పుడు జరిగిన విషయం అంతటా వ్యాపించింది. అతనిపైన వేసిన దావాలో హరిశ్చంద్ర న్యాయస్థానానికి రావలసి వచ్చింది. ఆ వ్యవహారంలో ఒక వ్యాపారికి 3,000 రూపాయలు హరిశ్చంద్ర బదులు తీర్చవలసి ఉంది. వ్యాపారి హరిశ్చంద్రకు ఒక నావను అమ్మి, కొంత పైకంకూడా ఇచ్చినట్లు తెలియవచ్చింది.

హరిశ్చంద్ర న్యాయస్థానాలలో తరచు కనిపించేవాడిలా, ఫిర్యాదు చేసేవారిలా ఆ న్యాయాధిపతికి కనిపించలేదు. న్యాయమూర్తి సయ్యద్ అహమద్ ఖాన్ అతనిని ప్రక్కకు పిలిచి తన సరసన కూర్చుండబెట్టుకొని .... "ఇప్పుడు చెప్పు, ఆ వ్యాపారి నీకు ఇచ్చిన ఆ నావ ఖరీదెంత ?" అని ప్రశ్నించాడు. "నేను ప్రోనోటులో వ్రాసినంత." అన్నాడా యువకుడు .... "అతనివద్ద నీవు తీసుకున్న ధనం ఎంత ?" తిరిగి న్యాయమూర్తి ప్రశ్నించాడు ... "ప్రోనోటులో వ్రాసినంత మొత్తం నాకు ముట్టింది." అన్నాడు హరిశ్చంద్ర. సయ్యద్ అహమద్ ఖాన్‌కు కొంచెం ఆశ్చర్యం కలిగింది, అతను కనుబొమలు ఎగురవేస్తూ 'బహుశా

నీవు మరిచిపోయి ఉండవచ్చునయ్యా, బయట అలా చల్లగాలికి తిరిగి వచ్చి అప్పుడు అసలు విషయం నాతో చెప్పు'' అన్నాడు.

హరిశ్చంద్ర బయటకు వెళ్ళినప్పుడు స్నేహితులు చెప్పజూశారు. "ఇంత చక్కని సదవకాశాన్ని చేతులారా విడిచిపెట్టకు. నీవు నిజంగా ఇవ్వవలసిన కొద్ది మొత్తం ముట్టచెప్పేసి యీ చిక్కునుండి బయటపడు,'' అని. హరిశ్చంద్ర అందరి సలహాలూ విన్నాడు కానీ మారు పలకలేదు.

న్యాయస్థానంలోకి తిరిగి వచ్చిన తరువాతకూడా, ముందు న్యాయమూర్తికి చెప్పిన మాటలే వల్లించాడు.

ఈ సంపన్న కుటుంబీకుడు తాను అందించిన సూచనలను సరిగా అర్థం చేసుకోలేదేమోనన్న సంకోచంతో న్యాయమూర్తి ముందు తాను అడిగిన విధంగానే తిరిగి ప్రశ్నించాడు. హరిశ్చంద్ర దానికి సమాధానంగా డబ్బు కొరకు సత్యాన్ని, మతధర్మాన్ని నేను త్యాగం చేయలేను అని వివరంగా చెప్పాడు.

'ఆ వ్యాపారి నన్ను ప్రోనోటు వ్రాయమని ఏమీ బలవంతపెట్టలేదు, నేను స్వయంగా అతను చెప్పిన షరతులకు ఒప్పుకున్నప్పుడు, అప్పు తీర్చే సమయానికి ఎందుకు మాట తప్పాలి? లేదు లేదు, అది నావల్లమాత్రం కాదు. సత్యానికి ప్రతీకగా నిలబడ్డ సత్య హరిశ్చంద్రుని పేరు నా పేరు'' అన్నాడు.

అతని నిజాయితి న్యాయమూర్తి సయ్యద్ అహమద్ ఖాన్ పైన దృఢమైన ముద్ర వెయ్యటంవల్ల, తతిమా తగాదాల విషయంలోకూడా సాక్షి విచారణ జరుపకుండగానే ప్రతివాది మాటపైన నిర్ణయం తీసుకొనేవాడని ఒక హిందీ రచయిత పేర్కొన్నాడు. 'ఈ వ్యవహారంలో ఇతని నిజాయితీని పూర్తిగా విశ్వసిస్తున్నాము. అందువల్ల ఈ తగాదాలో సాక్షి విచారణ లేకుండగనే నిర్ణయిస్తున్నాము.'' అని తీర్పు చెప్పారు.

ఇటువంటి సందర్భం ఇది ఒక్కటే కాదు. హరిశ్చంద్ర దృఢ సంకల్ప సిద్ధి గల నీతిమంతుడు, నిజాయితీపరుడు గనుక, ఎప్పుడూ ఇబ్బందులలో చిక్కుకుంటూనే ఉండేవాడు. చిన్న అప్పులకుకూడా పెద్ద ఎత్తున డబ్బు చెల్లించే భారం అతనిపైన పడేది.

హరిశ్చంద్ర వివాహమైన తరువాత, జగన్నాథస్వామిని దర్శించడానికి పూరీ వెళ్ళాలని కుటుంబంలోని వారంతా నిశ్చయించుకున్నారు. గోపాల్‌చంద్ర మిత్రుడు హరిశ్చంద్ర దగ్గరకు వచ్చి రెండు బంగారు నాణేలు అప్పుగా ఇచ్చారు. హరిశ్చంద్ర తనకాపైకంతో అంత అవసరం లేదని చెప్పినా వినిపించుకోకుండా ఆ ఆపద్బాంధవుడు "సవతి తల్లి ఉన్నప్పుడు పెట్టిన తిప్పలు నేనెరుగనివా" అనీ, అవసరానికి పనికి వస్తుంది ఉంచమనీ, పైపై తేనె పలుకులు ఒలికించి నాణేలు చేతిలో పెట్టాడు. ఆ ప్రయాణం దూరభారంతో కూడినది. సగభాగం రైలు ప్రయాణం, మిగిలిన సగ భాగం ఎద్దుల బండిలో పోవలసిఉంది. జేబులో ఉన్న రెండు బంగారు నాణెల మూలకంగా వారణాశి తిరిగి రావటం కొంతజాగు చేశారు. ఆ బంగారు నాణెలను డబ్బుగా మార్చారు. హరిశ్చంద్ర వద్ద డబ్బు ఉన్న విషయం అందరికి పొక్కింది. మరికొంతకాలం అక్కడే ఉండమని బల వంతం చేశారు. డబ్బు కాస్తా ఖర్చయిపోయింది. ఆ రెండు బంగారు నాణెల అప్పు తీర్చవలసి వచ్చే సరికి, పదిహేను వేలు ఖరీదుచేసే ఇల్లు కట్టబెట్టవలసి వచ్చిందని హరిశ్చంద్ర తరువాత ఓ సందర్భంలో చెప్పాడు.

నిజానికి తప్పంతా అప్పు ఇచ్చేవాళ్ళదని చెప్పవీలులేదు, తనకు తాను కొని తెచ్చిపెట్టుకున్నదే పెద్దచిక్కు. సాహితీ ప్రియత్వం, సుఖజీవనం, దానగుణం అతని మనస్సుని పూర్తిగా ఆకట్టుకోవటంవల్ల, ధనార్జన, పొదుపులాంటి అల్ప విషయాలు అతని మనస్సులో చొరబడలేదు. అతని కుటుంబం మొదటినుండి కష్టపడి వ్యాపారంలో అధిక లాభాలు పొందటంలో పేరు పొందినది, ఇప్పుడది తారుమారై కూర్చుంది. డబ్బు వ్యయంతప్ప, రాబడి తగ్గిపోయింది. బంధువులు, కుటుంబ మిత్రులు వారణాశి మహారాజు దగ్గరకు వెళ్ళి దుబారా ఖర్చు తగ్గే మార్గం సూచించమని ప్రాధేయపడ్డారు. మహారాజు హరిశ్చంద్రను పిలిపించి, అతని 'ధనవ్యయాన్ని' గురించి బంధుమిత్రుల అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అందుకు హరిశ్చంద్ర తనకు ధనంపైన వ్యామోహం లేదని నిర్మొగమాటంగా చెప్పాడు. "అయ్యా, ధనం మా పూర్వీకులను హరించివేసింది. కానీ నేను ధనాన్ని హరించాలని నిశ్చయించుకున్నాను," అని సమాధాన మిచ్చాడు.

ఆ విధంగా మహారాజు కలుగజేసుకున్నప్పటికి ప్రయోజనం మాత్రం శూన్యం. ఖర్చు అయ్యే డబ్బుమాత్రం ఖర్చయిపోతూనే ఉంది.



Indian Institute ...
117649
17.12.04

అటువంటి పరిస్థితులలో కుటుంబంలోని సభ్యులు తమ భాగాన్ని పంచుకోవాలని కోరటంలో ఆశ్చర్యం లేదు. భాగాలు పంచుకునే విషయంలో కుటుంబంలోనివారంతా ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ విషయం హరిశ్చంద్ర ఏమీ పట్టించుకోనేలేదు; హరిశ్చంద్రకు అటువంటి విషయాలలో జోక్యం కలిగించుకొనే స్వభావం బొత్తిగా లేదు. వారు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెట్టటం తప్ప, దస్తావేజులో ఏముందోకూడా పట్టించుకోలేదు. ఉన్న డబ్బంతా అందరూ పంచుకున్నారు. హరిశ్చంద్ర చిన్నతనంలో చేసిన అప్పులకుగాను అతని భాగం జమ కట్టుకున్నారు. స్థిరాస్తుల పంపకంకూడా తొందరపడి పూర్తిచేశారు. కొంతకాలానికి హరిశ్చంద్ర అమ్మమ్మ ఆస్తి వీలునామాలోకూడా అదే తంతు జరిగింది. ఆమె ఆస్తిలో హరిశ్చంద్రకు ఏమీ చెందకుండా వీలునామా మార్చివేశారు.

ఆస్తి పంపకాలు జరిగినంతమాత్రాన ఆనాటి ఆచారాలనుబట్టి కుటుంబం పూర్తిగా విడిపోయేది కాదు. సమష్టి కుటుంబానికి చెందిన ఇల్లు అందరి సొత్తుగా ఉండేది. అందరూ కలసి అదే ఇంట్లో నివసిస్తూ ఉన్నప్పటికీ, హరిశ్చంద్ర ఉన్న భాగంతో కుటుంబ సభ్యులు దగ్గర సంబంధం పెట్టుకోలేదు. రానురాను తనకు వచ్చే ఆదాయంకూడా కరిగిపోవటంతో, అప్పులు చెయ్యటం ప్రారంభించాడు. అప్పులు పెరిగిపోవటంవల్ల, ఆస్తి అమ్మవలసిన పరిస్థితి ఏర్పడింది. హరిశ్చంద్ర ఆస్తిని అమ్మవలసి వచ్చినప్పుడు, సోదరుడైన గోకుల్‌చంద్రకు మొదటి అవకాశం ఇవ్వవలసి ఉంది. గోకుల్‌చంద్ర, హరిశ్చంద్ర చేసిన అప్పులు చెల్లించి, ఆస్తిని అధీనం చేసుకున్నాడు. హరిశ్చంద్ర ఈ పరిణామానికి సిద్ధంగానే ఉన్నాడు. ఆస్తి అంతా హరించుకుపోయినా అతడు అంతగా బాధపడలేదు కానీ. అప్పుకూడా పుట్టకపోవటం, దానిమూలకంగా ఎదురైన క్లిష్టపరిస్థితులు అతనిని బాగా కృంగదీశాయి. బంధు మిత్రులు, హరిశ్చంద్ర పుస్తకాలకూ, పత్రికలకూ అంటూ చేస్తున్న దుర్వ్యయాన్ని దుయ్యబడుతున్నా, అతని దృఢసంకల్పం సడలలేదు. హిందీ సాహిత్య సంపద పెంపొందించే నిరంతర కృషి ఆపలేదు.

# 5

భారతేందుడు హిందీ సాహిత్యానికి చేసిన అమూల్యమైన సేవ తేటతెల్లం కావాలంటే, హిందీ సాహిత్య ప్రాంగణంలో అతను అడుగు పెట్టక ముందు హిందీ సాహిత్య పోకడలను ఒకమారు పరిశీలించి చూడవలసి ఉంది.

ఉత్తర హిందూస్థానంలో, అనగా ఇప్పటి రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్లలోని మాండలిక భాషలనుండే హిందీ అనబడే ఈనాటి భాష ఉద్భవించింది. ఈ ప్రాంతాలలో వాడుకలో ఉన్న మాండలిక భాషలు: మీవతి, మార్వారి, జైపూరి, రాజస్థాన్‌కు సంబంధించిన మాల్వి, హర్యానాకు చెందిన ఖడీబోలీ, బంగారు భాషలు; బ్రజ్ భాష, కనౌజి, బుందేలీ, అవధి, బాగ్‌హేలి, ఛత్తీస్‌గడీ, మైథిలి, భోజ్‌పూరీ, మాగధి మొదలైనవి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్‌లోనివి. దేవనాగరి చాలావరకు వ్రాయటానికి ఉపయోగించేవారు.

ఈ మాండలికాలలో, ముఖ్యంగా మార్వాడి, బ్రజ్ భాష, అవధి, మైథిలి, భోజ్‌పూరి మొదలైనవి ముఖ్యంగా కవులచే వాడబడేవి. ఈ భాషలలో సాహిత్యం చాలావరకు పద్య రూపంలోనే ఉండేది. వచన సాహిత్యం అరుదుగా ఉండేది, మధ్య కాలం వరకు చాలా తక్కువగానే ఉండేదని చెప్పవచ్చును.

మహమ్మదీయులు భారతదేశాన్ని ఆక్రమించుకున్న తరువాత కొత్త మార్పులెన్నో చోటుచేసుకొన్నాయి. మహమ్మదీయులు దండెత్తి వచ్చి ఆక్రమించుకున్న ప్రాంతాలలో విదేశీ భాషల ప్రభావం పడింది; అరబిక్, పర్షియన్, టర్కిష్ భాషలలోని మాటలు కొన్ని వారు ఆక్రమించుకున్న ప్రాంతాలవారు మాట్లాడే వాడుక భాషలతో సమ్మిళితమైపోయినాయి. ఈ భాషా సమ్మేళన కారణంగానే ఉర్దూ భాష ఉద్భవించింది. (ఉర్దూ అంటే టర్కీ భాషలో మిలటరీ బస అని అర్థం). ఈ కొత్తరూపు దిద్దుకున్న నూతనభాష హిందీ భాషలో మిళితమైన అరబిక్, పర్షియన్, తుర్కీ పదాల సమ్మేళనమే. ఆ యా ప్రాంతాల మాండలిక భాషలకు, కొత్తగా దండెత్తి వచ్చిన వారి భాషలకు సన్నిహిత సంబంధం

ఏర్పడింది. ఆ విధంగా హిందువులు పర్షియన్ భాషను అలవర్చుకోవటం' ఢిల్లీలో మాండలిక భాషలుగా ఉన్న రెఖటా లేక హిండ్వి భాషలను మహమ్మదీయ రాజులనుండి ఫకీరుల 'జాలియాస్' వరకు అలవర్చుకోవటం జరిగింది. బిజాపురీ షామిరాన్, బుర్హనుద్దీన్ సయ్యద్ మహమద్ గౌస్ డ్ రాజ్ మొదలైన వారంతా హిండ్విలోనే రచించేవారు. చక్కని హిందీ భాషగా చెలామణి అయ్యే హిండ్వి భాషలోనే, అమీర్ ఖుస్రు, మలిక్ మొహమ్మద్ జాయసి, కబీర్ కూడా రచించేవారు. మొగలాయి రాజులు, ముఖ్యంగా అక్బర్ హిండ్వి భాషకు బాగా ప్రోద్బలం ఇచ్చారు. అక్బర్ హిండ్వి భాషలో రచించిన కొన్ని పద్యాలను 'అక్‌బార్‌రే' అన్న కలం పేరుతో కొనసాగించారు. అతనికి సన్నిహితులైన మంత్రులు, టొడార్‌మాల్, బీర్‌బల్, అబ్దుల్ రహీం ఖాన్‌ఖానా, అబుల్ ఫైజి అతని సమకాలికులు గంగాకవి, తులసీదాస్, సూర్‌దాస్, కేశవదాస్ మొదలైన వారుకూడా అదే విధంగా హిండ్వి భాషలోనే రచనలు చేశారు. జహాంగీర్, షాజహాన్, ఆ తరువాత ముర్షిదాబాద్, జీడ్, హైదరాబాదు (దక్కను) ఏలిన రాజులంతా హిందీ భాషకు ప్రోత్సాహం ఇచ్చినవారే. చివరి మొగలాయి ప్రభువు స్వయంగా కవి, చెప్పుకోదగ్గ చక్కని హిందీ భాషలో రచించిన సమర్థుడు.

మొగలాయి కాలంలో పద్య రచన ముఖ్యమైన దుర్గం. రాంప్రసాద్ నిరంజన్ వ్రాసిన భాషా యోగవశిష్ట (1741); పండిత దౌలత్‌రాం అనువదించిన పద్మపురాణం (1761) వంటి వచన కావ్యాలు బహుకొద్ది మాత్రం వెల్వడినవి. క్రైస్తవ మతబోధకులు రావటంతో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ బోధకులు ఆ యా ప్రాంతాల వారికి తమ మతం బోధించటానికి వారి మాండలిక భాషనే వాడదలచారు. దానికి అనుగుణంగా వారికి ముద్రణా సౌకర్యాలు కూడా ఉన్నవి. ఈ సదుపాయాల వల్ల భారతీయ భాషలలో వ్రాసే రచయితలకు, హిందీ రచయితలకు కూడా వ్రాసే అవకాశాలు ఎక్కువగా లభించాయి. భారతదేశంలో ఎక్కువమంది ప్రజలు అర్థంచేసుకోగల భాషను వారు సాధనంగా వాడదలచారు. అందువల్ల హిందీ రచనకే ఎక్కువ ప్రోత్సాహం లభించింది. అనేక కారణాలవల్ల ఈ భాషను వచన గ్రంథాలలో వాడలేదు. నిజానికి ఉన్న కొద్ది వచన గ్రంథాలలోనూ బ్రజ్ భాషే వాడబడింది.

మొగలు సామ్రాజ్యపతనమై, ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధిక్యతలోనికి వచ్చిన తరువాత భారతదేశంలోని వాడుకభాషల ప్రాముఖ్యత బ్రిటిష్ వారి దృష్టిలో పడింది. ఇంగ్లండు దేశం నుండి కొత్తగా వచ్చిన వారికి భారతీయ భాషలలో పరిచయం కలగటానికిగాను, కంపెనీ వారే (1780లో) ఒక కాలేజీని ప్రారంభించారు. డాక్టర్ గిల్ క్రిస్టు దానికి పెద్దగా నియమింపబడ్డాడు. ఉర్దూ భాష అతనిని ఎంతగా ఆకర్షించిందంటే ఉర్దూ - ఇంగ్లీషు నిఘంటువు నొకదానిని తయారుచేసి, ఉర్దూలో వ్యాకరణ పుస్తకాన్ని కూడా వ్రాశాడు. అతడు సమన్వయ పరచిన రచయితలు ఆనాటి రాజకీయ స్థిరత్వాన్ని, ఆర్థిక సహాయాన్ని అండగా తీసుకొని రచనలు సాగించారు. వారంతా బహు భాషాకోవిదులు. స్థానిక భాషలు (హిండ్వీ లేక హిందీ) మాత్రమే కాక అప్పటి ప్రభుత్వ భాషలయిన ఉర్దూ, పర్షియన్ భాషలలో కూడా వారు ఆరితేరినవారు. ఆగ్రానుండి వచ్చిన లల్లూజూలాల్ కి ఉత్తరప్రదేశ్‌లో మాట్లాడే ఖడీబోలీ, బ్రజ్ భాషలతోకూడా పరిచయం ఉంది. భగవత్ పురాణాన్ని హిందీభాషలోకి అనువదించి, ప్రేమ్‌సాగర్ అన్న పేరుతో ప్రచురించాడు. హితోపదేశ, పంచతంత్ర గ్రంథాలను ఆధారంగా చేసుకొని బ్రజ్ భాషలో రాజనీతి అన్న గ్రంథాన్ని రచించాడు. శింఖాసన్ బతీసి, బైతాల్ పచీసి మొదలైన పుస్తకాలను ఉర్దూ - హిందీ మిశ్రితమైన భాషలో వ్రాశాడు. నాసికేతోపాయన్ (1803) అన్న గ్రంథాన్ని సాదల్ మిశ్రా అనే మరో ప్రఖ్యాత రచయిత రచించాడు. అతను వాడిన హిందీ భాష లల్లూజూలాల్ భాషకన్నా స్పష్టంగా శుద్ధంగా ఉండేదని వినికిడి. అయినా అతడు ప్రభుత్వం వారి ఆదరణ అంతగా చూరగొనలేక పోయాడు. ఖేత్ కి కహానీ అన్న సాంప్రదాయ సిద్ధమైన గ్రంథాన్ని ఇన్‌షా అల్లాఖాన్ రచించాడు.

వ్యావహారిక హిందీ భాషను తరచుగా వచన గ్రంథాలలో వాడినప్పటికీ, అది అనర్థంగా మాత్రం దేనికి భావించబడలేదు. రాజారామమోహనరాయ్ తాను రచించిన బన్‌గదూత్ ని నాలుగు భాషలలో ప్రచురించాడు. అందులో ఒకటి దేవనాగరి లిపిలో హిందీ వచనకావ్యం. అతడు దానిని కరపత్రాలలోకూడా వాడుకోవటం జరిగింది. ఉదంత్ మార్తాండ్ (1826) మొట్టమొదట ప్రచురింపబడ్డ హిందీ పత్రికలో హిందీ వచనమే వాడబడటం గమనార్హం;

హిందీ సాహిత్యానికీ, హిందీ పత్రికా ప్రచారానికి ఇవ్వబడ్డ ప్రోత్సాహం ఆ తరువాత కొన్ని సంవత్సరాల తరబడి కుంటుపడిపోయింది. ప్రోద్బలాన్నిచ్చి

ముందంజవేయగల దక్షత కరువైంది. ఈస్ట్ ఇండియా కంపెనీవారి దృష్టి మొగలు సామ్రాజ్యాన్ని రూపుమాపాలన్న లక్ష్యంపైనే కేంద్రీకరించబడింది. ఆ ప్రాంతంలోని మాండలిక భాషను ఆకట్టుకోవాలన్న దృఢనిశ్చయంతో హిందీ భాషను వారు సరకుచెయ్యకపోవటంలో ఆశ్చర్యం లేదు.

హిందీ వాడుక భాషగాగల ఉత్తర హిందూదేశంనుండి వెల్వడిన మొదటి హిందీ పత్రిక 1844 సంవత్సరంలో వారణాశినుండే ప్రారంభించబడింది. తారా మోహన్ మిత్ర ఈ పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించగా, రాజాశివప్రసాద్ 'సితార-యే-హింద్' పత్రికా పోషకుడుగా ఉన్నాడు. ఆ పత్రిక పేరుకు హిందీ లిపిలో ఉన్నా, పర్షియన్, ఉర్దూ భాషల ప్రభావమే అందులో గోచరించేది. రాజా శివప్రసాద్ దేవనాగరి లిపి అంటే అభిమానం మెండని చెప్పుకున్నా తాను ప్రచారంలోకి తెచ్చింది మాత్రం పర్షియన్ పదాలు కలిసిన ఉర్దూభాష మాత్రమే. హిందీ రచయితలకు ఈ పద్ధతిని ప్రోత్సహించటానికి మనస్కరించలేదు. ఈ పట్టుదల పైన 1850 సంవత్సరములో సుధాకర్ అనే మరో పత్రిక వెలసింది. దీనిని ప్రారంభించినవారు తారామోహన్‌మిత్ర. ఆ పత్రికలో వాడిన భాష కొంత వరకు శుద్ధమైన హిందీ భాష అని చెప్పవచ్చును.

హిందీ భాషకు వ్యతిరేక ప్రచారం సాగించే రాజాశివప్రసాద్ వంటివారు, వారి ప్రచారాన్ని కేవలం పత్రికా విషయానికి మాత్రమే పరిమితం చెయ్యలేదు. ఇతిహాస్ తిమిర్‌నాశక్ వంటి పదజాలం వాడటం విషయంలో కూడా ప్రతిఘటించారు. ప్రత్యర్థుల నాయకుడు రాజాలక్ష్మణ్‌సింగ్ (18్6—96) హిందీ భాషకు, ఉర్దూ భాషకు గల ముఖ్యమైన విభేదాలను వక్కాణించాడు. ఆ రెండూ సంబంధం లేని వేరు వేరు భాషలన్న తన అభిప్రాయం వ్యక్తపరిచాడు. వాడుకలో ఉన్న చిన్న పదాలు హిందీ భాషలోనే ఉండగా, పర్షియన్, అరబిక్ భాషలనుండి ఎరువు తెచ్చుకోవలసిన అగత్యం లేదని గట్టిగా అభ్యంతరం తెలిపాడు.

# 6

గ్రంథాలలో, పత్రికలలో వాడదగ్గ భాషను గురించి వాదోపవాదాలు జరుగుతున్న సమయంలో, 1867 వ సంవత్సరం కవి వచన సుధ అన్న మాస పత్రికను ప్రారంభించి, హరిశ్చంద్ర ఈ వివాదానికి ఒక పరిష్కార మార్గం సూచించాడు. ఈ పత్రిక ఆదిలో ప్రాచీనార్వాచీన కవితలను ప్రచురించాలనుకున్నది. ప్రారంభించిన కొత్తలో 'బిహారీ', జాయసీ వ్రాసిన 'పద్మావతి', 'అనురాగ్‌భాగ్' వంటి పద్యాలు ప్రచురింపబడ్డవి. హరిశ్చంద్ర స్వయంగా పద్య రచనా కుశలత గలవాడే గాక అనర్గళంగా ఆ పద్యాలు గానం చేసే ప్రతిభకూడా కలవాడు. అతనిని 'కలియుగ్ కా కన్హయా' లేక 'కలియుగ కృష్ణుడు' అని పిలిచేవారు. అతని ఛాయనుబట్టి కొంత, గిరజాలు తిరిగిన పొడుగాటి కురులనుబట్టి కొంత అతని కాపేరు బాగా అన్వయించింది. పద్య రచనలో ప్రావీణ్యత, అనర్గళ కవితాగాన చాతుర్యం, పత్రికా ప్రచురణలో సామర్థ్యం వంటి బహుగుణ సమన్వయ రూపం ఎందరో పాఠకులను ఆకర్షించింది.

కవి వచన సుధ పత్రికా ప్రతులు కొనేవారి సంఖ్య 250, ఇందులో 150 ప్రతులకు మాత్రమే చందాదారులుండేవారు. మిగిలిన 100 ప్రతులు బ్రిటిష్‌వారు సహకరించి కొనేవి. అయినా, పత్రికకు ప్రచారం బాగా పెరిగింది. అనతి కాలంలోనే అది పక్షపత్రిక అయి తరువాత వార పత్రికగా కూడా వెల్వడింది. కవి వచన సుధ కొంతకాలానికి వచన రచనలు కూడా ప్రచురించింది.

1867 వ సంవత్సరంలో జమ్ము, సికందరాబాదు, వారణాశి ప్రాంతాల నుండి వెల్వడిన మూడు స్వతంత్ర హిందీ పత్రికలలో కవి వచన్ సుధ ఒకటని తరువాత వ్యక్తమైన అంచనా. హిందీ పత్రికా లోకంలో రామమోహన్‌రాయ్ అంతటివాడని పేరు ప్రఖ్యాతులు గడించిన హరిశ్చంద్ర కవి వచన్ సుధ పత్రికకు సంపాదకీయం నిర్వహించాడు. ఈ పత్రిక ప్రారంభించే సమయానికే అతను రచయితగా విశిష్ట స్థానాన్నందుకున్నాడు. పత్రికా సంపాదకీయం ప్రారంభించి

ఎందరో రచయితలకు మార్గదర్శకుడైనాడు. అతని కృషి ఫలితంగా హిందీ పత్రికా రచనకు ఒక సుస్థిరత్వం ఏర్పడింది. ఆ తరువాత సాహిత్య విలువలు పుష్కలంగా గల ఎన్నో పత్రికలు తలయెత్తినా ప్రజాదరణ లోపించటంవల్ల అవి ఎన్నో సంవత్సరాలు కొనసాగలేదు.

పత్రికా ప్రచురణలో విజయవాహికగా కవి వచన సుధ హరిశ్చంద్రకు అక్కరకు వచ్చింది. ఆ తరువాత కొద్ది సంవత్సరాలకు (1873) హరిశ్చంద్ర 'మేగజైన్' అన్న పేరుతో మరో పత్రికను కూడా ప్రారంభించాడు. ఆ పత్రిక కొంతవరకు ఉన్నత స్థానాన్నే అందుకుంది. 'మేగజైన్' అన్న పేరు అతని మిత్రులకు అంతగా నచ్చకపోవటంవల్ల హరిశ్చంద్ర దానికి చంద్రిక అన్న పేరు మార్చి పెట్టాడు. పాతపేరు ఆంగ్లంలో వెనక అట్టపైన మాత్రం మిగిలిపోయింది.

హరిశ్చంద్ర చంద్రిక నూతన పద్ధతులలో నడచిన పత్రిక. వచన రచనలు, డ్రామాలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు మాత్రమే కాకుండా 'చెస్' వంటి ఆటల పోటీల విశేషాలు, హాస్యరస ప్రధానమైన రచనలు, ఆ మాటకి వస్తే మానవాళికి సంబంధించిన వివిధ విషయాలపైన రచనలు ఆ పత్రికలో చోటుచేసుకున్నవి. ఆ పత్రికకు చందాదారులుగా ('సహాయ సంపాదకులు' గా పేర్కొనబడిన) ఈశ్వర చంద్రవిద్యాసాగర్, ఖేషుబ్ చందర్ సెన్, స్వామి దయానంద సరస్వతి వంటి ఆనాటి ప్రముఖులంతా ఉండేవారు. భారతదేశంలో ఉన్న బ్రిటిష్‌వారు కవి వచన సుధ పత్రికను పోషించిన విధంగానే ఈ పత్రికను కూడా వంద ప్రతులు కొని తోడ్పడేవారు.

రాజాశివప్రసాద్ 'సితార-యే-హింద్', అతని అనుచరులూ అనుసరించిన పర్షియన్ భాషా పదజాలంతో నిండిన హిందీ భాషకూ, వారణాశి బ్రాహ్మణులు వాడే సంస్కృత పద భూయిష్టమైన హిందీ భాషకూ వ్యతిరేకంగా, సామాన్య మానవులు వాడే వాడుక భాషను ప్రచారంలోకి తీసుకొని రావటమే ఈ పత్రిక ముఖ్య లక్ష్యంగా పెట్టుకొన్నది. హిందీభాష వాడుకలో ఉన్నది ఉన్నట్లుగా రచనలో వాడాలని హరిశ్చంద్ర పట్టుపట్టాడు. అతి సంపన్న కుటుంబంలో జన్మించిన హరిశ్చంద్ర సామాన్య ప్రజలతోనూ, అంతకన్న తక్కువ వర్గాల వారితోనూ సమస్థాయిలో కలిసి మెలిసి వ్యవహరించటం ప్రశంసనీయమైన విషయం. హరిశ్చంద్ర వేషంలో డాబు, దర్పం అగుపించినా, భాషా విషయంలో మాత్రం అతి సామాన్యులతో, వీధి భాగవతులతో సహితం కలిసి కవితలల్లేవాడు, అతను అను

సరించదలచినది సామాన్య మానవుడు వాడే హిందీభాష. తాను అన్వేషించిన మార్గాన్నే పత్రికా ముఖంగా అనుసరించాడు. హరిశ్చంద్ర చంద్రిక అన్ని వర్గాల వారిచే ఆదరించబడింది. పాఠకులు ఎల్లప్పుడూ రాబోయే పత్రిక కొరకు ఎదురు చూచే వారు. హరిశ్చంద్ర ఆ పత్రిక విషయంలో సంపూర్ణమైన తృప్తిచెందాడు.

ఈ రెండు పత్రికలు పత్రికారచనకు అనంతమైన ప్రోత్సాహాన్నిచ్చినవి. ఆ ప్రోత్సాహం ఎన్నో నూతన పత్రికలకు జీవం పోసింది. రచయిత లెందరికో కూడా నూతనోత్సాహం కలిగింది. 'హరిశ్చంద్ర మండలి' (హరిశ్చంద అనుచరులు) ఒకటి స్థాపించబడి, అతని తదనంతరంకూడా అది కొనసాగించబడింది. అందులోని సభ్యులు హరిశ్చంద్ర రచనలవల్ల ప్రభావితులమైనామని సగర్వంగా చెప్పుకున్నారు. పెక్కుమంది వలెనే ఉర్దూ ప్రభావం నుండి తేరుకొని, హిందీ భాషాభిమానిగా మారిన మీర్జాపూర్ వాస్తవ్యుడు బద్రీనారాయణ చౌదరి 'ప్రేమ్ ఘన్' అందులో ముఖ్యుడు. 'ఆనంద్ కాదంబిని' అన్న మాస పత్రికను, నగరి నిరాద్ అన్న వార పత్రికను అతను ప్రారంభించాడు. ఎన్నో సుదీర్ఘ రచనలు చేసిన రచయిత అతను. హరిశ్చంద్ర అతనికి పత్రికా విషయమై కొన్ని సూచనలు చేశాడు. ఒక రచయిత రచనలతో గ్రంథంవలె పత్రికా రచన సాగరాదు. 'వివిధ రంగాలలోని విషయాలను పత్రికలో సేకరించాలి. అనేక రచయితలకు పత్రికా రచనలో అవకాశం కలిగించాలి' అన్న విషయాలు విపులీకరించాడు. ఉర్దూ ప్రభావంనుండి బయటకు వచ్చిన మరొక ప్రఖ్యాత రచయిత పండిత ప్రతాప్ నారాయణ మిశ్రా, హరిశ్చంద్ర పత్రికలో రచనలు చేయటంతో ప్రారంభించాడు. తరువాత కాన్పూరు బ్రాహ్మిన్ పత్రికా సంపాదకుడుగా పనిచేశాడు. కలకత్తా నుండి అలహాబాదుకు వచ్చిన పండిత బాలకృష్ణ భట్టా, హిందీ ప్రదీప్ అనే పత్రికను ప్రారంభించాడు. తరువాత అలహాబాదులోని హిందీ వర్ధని సభకు మూలాంకురం అదే. ఆ సభకూ, పత్రికకూ చైతన్యం కూర్చింది హరిశ్చంద్ర. ఆ పత్రికకు నాంది వచనం అతనే వ్రాసేవాడు. ఆ సభలో అధ్యక్షోపన్యాసం ఇవ్వటానికి గాను అలహాబాదు వెళ్ళినపుడు, దేశ పురోభివృద్ధికి మాతృభాష ప్రాధాన్యతను గురించి (పద్యంలో) నొక్కి వక్కాణించాడు. ఉర్దూనుండి హిందీ భాషాభిమానిగా మారిన మరింకొక ప్రఖ్యాత రచయిత లాలా శ్రీనివాసదాస్. అతను మధురనుండి తరలి వచ్చి, సదా ధర్మ సదా ధర్మ అన్న పత్రికను ప్రారంభించిన గొప్ప రచయిత. ఆ పత్రిక తరువాత చంద్రికతో చేరిపోవటం జరిగింది. హరి

శ్చంద్ర పట్ల అపార గౌరవాభిమానాలు గల రచయిత రాధాచరణ్ గోస్వామి, తన అభిమాన సూచకంగా భారతేందు అన్న పత్రికను ప్రారంభించాడు. హరిశ్చంద్రను అమితంగా అభిమానించే మరో వ్యక్తి రాంశంకర్ వ్యాస్, సారసుధానిధి అన్న పత్రికను ప్రారంభించాడు.

ఈ పత్రికా సంపాదకులు కవి వచన్ సుధ లేదా హరిశ్చంద్ర చంద్రిక పత్రికలనుండి ప్రోత్సాహం పొందినవారే. తాను సాధించగలిగిన ఈ శుభోదయాన్ని హరిశ్చంద్ర గర్వకారణంగా తీసుకోవటం సహజమేనేమో. తాను కానీ తన మిత్రులు కానీ వ్రాసిన గొప్ప రచనలు చంద్రికలో ప్రచురించబడినవేనని అతను తరువాత కాలంలో తరచుగా వ్యక్తపరచిన విషయం.

పత్రికా ప్రచురణలో అతను సాధించిన విజయాన్ని ఆసరాగా తీసుకొని బాల బోధిని, భగవత్ తోషిణి అన్న మరి రెండు పత్రికలు ప్రారంభించాడు. మహిళోద్యమాన్ని, మహిళా విజ్ఞానాన్ని ప్రోత్సహించే మాస పత్రిక బాలబోధిని. బ్రిటిష్‌వారు కవి వచన సుధ, హరిశ్చంద్ర చంద్రిక పత్రికలు కొన్న విధంగానే బాలబోధిని పత్రికా ప్రతులుకూడా కొన్ని కొని సహాయపడేవారు. వైష్ణవ భక్తుడైన హరిశ్చంద్ర, వైష్ణవ భక్తులకుగాను నాల్గవ పత్రికగా వెల్వడిన భగవత్ తోషిణి ని ప్రారంభించాడు. ఆ పత్రిక ఎక్కువకాలం నిలువలేదు.

హరిశ్చంద్ర వైష్ణవ మతాచారాలను నమ్మిన భక్తుడు గనుక ఆ సదాచారాలను ప్రచారంచేసే నిమిత్తం ఒక సంఘాన్ని నెలకొల్పి దానిద్వారా ఇతర వైష్ణవ భక్తులతో, ముఖ్యంగా ఉత్తర హిందూదేశంలో నివసించే భక్తులతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకున్నాడు. మధురలో నివసించే రాధాచరణ్‌గోస్వామి వల్లభాచార్యుల అనుచరుడు. అతనితో హరిశ్చంద్రకు సన్నిహిత సంబంధం ఉండేది. ఈ వైష్ణవ మత పెద్దలను గురించి, పూర్వుల జీవిత విశేషాలను గురించి దీక్షతో పరిశోధనా గ్రంథం వ్రాసే విద్యార్థివలె హరిశ్చంద్ర విచక్షణా దృష్టితో చర్చిస్తూ గోస్వామికి లేఖలు వ్రాసేవాడు. గోస్వామి ద్వారా ఆయా మహనీయుల చిత్రపటాలు సంపాదించటానికి ఎంతో ధనంకూడా వెచ్చించేవాడు.

గోహత్య మహాపాతకమని నమ్మిన హరిశ్చంద్ర, ఆ విషయమై రచనలు, నాటకలు ప్రోత్సహించి, దానికిగాను పారితోషికంకూడా ప్రకటించేవాడు, గోహత్య కూడదన్న నమ్మకమే గాక మాంసాహారం నిషేధించాలనీ, మద్యం సేవించ

కూడదనీ పట్టుబట్టినవాడు. ఈ నిషేధాలను అనుసరిస్తామని సంఘ సభ్యులతో వ్రాత పూర్వకంగా ప్రమాణాలుకూడా చేయించేవాడు. ఈ సంఘం ఎంత కాలం కొనసాగినదీ తెలియదు. కానీ, హరిశ్చంద్ర హృదయానికి హత్తుకున్న ఆదర్శాలివి.

హరిశ్చంద్ర చేపట్టిన మరో కార్యక్రమం విదేశవస్త్రాల వాడుకను గురించి. తన పత్రికా పాఠకులతో, మిత్రులతో విదేశ వస్త్రాలు వాడకూడదని ప్రమాణాలు చేయించాడు. ఈనాడు ఉత్తరప్రదేశ్‌గా వ్యవహరించబడే ప్రాంతంలో, ఇతర ప్రాంతాలలో హిందీని ప్రాథమిక భాషగా తీసుకొని రావాలనికూడా అతను ఎంతగానో కృషిచేశాడు.

# 7

హరిశ్చంద్ర ఏడవ యేటనే కవితా రచన ప్రారంభించాడు. రాజకీయ, సాంఘిక విషయాల గురించి వ్రాసినప్పటికీ, ఎక్కువ భాగం కవితలో వైష్ణవ భక్తిభావన తొణికిసలాడుతుంది. భక్తిపరంగా రచించిన కవులలో బహుశా అతనే చివరివాడేమోనన్న అభిప్రాయంకూడా కద్దు.

హరిశ్చంద్రకు బ్రజ్ భాషపైన మక్కువకొద్దీ రాధాకృష్ణుల గురించిన భక్తికీర్తనలు, మొదలైనవి ఆ భాషలోనే రచించాడు. కొందరు బ్రజ్ భాషను 'వెన్నెముక లేని' భాషగా వర్ణించినా - హరిశ్చంద్ర రచనల్లో ఆ భాష - మృదు మధురంగా నూతన రూపురేఖలు దిద్దుకొంది. అతను తన రచనల్లో ప్రేమ భావనకీ, మహత్తరమైన భక్తి భావనకీ మధ్య సంయోగం తీసుకొని రాగలిగాడు. అతని పెక్కు రచనలలో శృంగార రసానికి ఆధ్యాత్మిక చింతన జోడించబడుతుంది. శృంగార పారవశ్యమే భక్తిపారవశ్యంగా తాదాత్మ్యం చెందుతుంది.

హరిశ్చంద్ర దాదాపు మూడువేల భక్తి కీర్తనలు, ప్రణయగీతాలు రచించాడు. 'హిందోళ', 'పూర్వి', 'ఖ్యాల్', 'కళ్యాణి', 'విహాగ' వంటి అనేక రాగా

లలో (బహుశా వంద వరకు) మధుర గీతాలు వ్రాశాడు. అతని పాటలన్నీ అతని దైన ప్రత్యేక బాణీలో ఇరవై సంపుటాలలో సంతరింపబడ్డాయి.

'భక్తిసర్వస్వ' అన్న దానిలో భగవంతుని 'లక్షణాలను' విశదీకరించాడు. 'ప్రేమ మాలిక' లో బాలకృష్ణుని లీలలు ప్రతిబింబింపజేశాడు. కృష్ణుడు తాను పుట్టిన ఊరు వదలి వెళ్లే సమయంలో గోపికల ఆరాటాన్ని మనోరంజకంగా వర్ణించాడు. కృష్ణ వియోగాన్ని తాళలేక గోపికల మనసులలోని ఆవేదనే పాటగా హరిశ్చంద్ర రచనలో రూపుదిద్దుకుంటుంది. ఆ వియోగాన్ని భరించే శక్తిని, ఆత్మ శాంతిని గూర్చిన గీతికలు కొన్ని, ఆ దేవదేవుని లీలలు గూర్చిన పాటలు కొన్ని, భక్తుల అనురాగ సుధారస పూరితమైన గీతాలు కొన్ని, నిరాశాపూరితమైన భక్తుల ప్రార్థనలు కొన్ని, ఈ విధమైన నవరసభావపూరితమైన గీతాలు రచించాడు. ప్రతిఫలాపేక్ష లేకుండా, భగవంతుని నిర్మల హృదయంతో ఆరాధించటమే అన్నిటిలోని సారాంశము. మూర్తీభవించిన దైవారాధనే 'ప్రేమ సరోవర్' గా రూపుదిద్దుకుంది. ప్రేమ మార్గంలోని అవాంతరాలను వర్ణించే గీతికలు పన్నెండు, స్వచ్ఛదర్శ సరోవర వర్ణనా గీతాలు ఏడు, మరొక ఏడు గీతాలలో, అనంతమైన భగవంతుని ప్రేమ వర్ణించబడింది. చిట్టచివరి నాలుగు గీతికలు అచంచలమైన ప్రేమ తత్వాన్ని వెల్లడించినవి, పరమాత్ముడే లేనిచో ప్రాణికోటి ఎక్కడిదన్న సూత్రాన్ని నమ్మి, ఆ పరమాత్ముని సాయుజ్యము గన్న కవి 'ప్రేమ మాధురి' లో తన ప్రభువుతో ఏకత్వం దర్శించాడు. స్త్రీకి తన విభునిపైన అపార ప్రేమ భావన కూడా ప్రేమోన్మాదంగా అగుపించకపోదు. 'ప్రేమపుల్వారి' ప్రేమను 'పవిత్రత' కు చిహ్నంగా నిర్వచిస్తుంది. 'ప్రేమ ప్రతాప్' నిష్ఫల ప్రేమనుండి ఉద్భవించే నిరాశను వర్ణించి చెబుతుంది. కష్టకాలంలో ప్రేమ పరిణామాలను గురించిన అల్లిక 'ప్రేమ అశ్రు వర్షన' ఋతుశోభను గురించి, ఊయలలూగే ఆనంద పారవశ్యాన్ని గురించి, చల్లని గుబురులలో దాగుడుమూతల సరస సల్లాపాలను గురించి ప్రేమికుల సంభాషణా మాధుర్యాన్ని గురించి ఈ పుస్తకంలో నలభై ఆరు పదాలలో రసవత్తరంగా వర్ణించబడింది. ప్రకృతి ప్రసాదించే తొలకరి జల్లులలోని మనోజ్ఞానుభూతిని ఆటపట్టుగా తీసుకొని రచించిన పుస్తకమది. కేవలం కల్పనాలోకంలోని భావనలు కాక, సత్యజీవితంలో ప్రాపంచిక విషయాల మధ్య, మానవ ప్రేమ పరిణామాలను గురించి వివరించినది; 'ప్రేమ తరంగ', విఫలప్రేమలోని అనుభూతులనుకూడా వివరించి వ్రాశాడు. ప్రేమ పరిపక్వత చెందనిదే జీవితం శూన్యమనీ, అర్థరహితమనీ 'ప్రేమ సరోవర్' లో సూచిస్తాడు

బ్రజ్ భాషకు హరిశ్చంద్ర సమకూర్చిన సాహిత్య రత్నాల రాసులవల్ల ఆ భాషా వైభవం ఇనుమడించిందనే చెప్పవచ్చును. బ్రజ్ భాషను అంత ప్రతిభావంతంగా వాడిన రచయితలలో అతనే చివరివాడు.

బ్రజ్ భాషలో హరిశ్చంద్రకు ప్రావీణ్యత ఎంత ఉన్నప్పటికీ, కాలాను గుణ్యంగా రానున్న మార్పులను గ్రహించినవాడు గనుక, అందరికన్నా ముందుగా ఖడీబోలీ భాషలో పద్య రచన ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో ఖడీబోలీ, బ్రజ్ భాషను రూపురేఖలు లేకుండా తుడిచివేసిన విషయం అందరికీ విదితమే. కలకత్తా నుండి వెల్వడిన భారత్ మిత్ర పత్రికలో ఖడీబోలీలో హరిశ్చంద్ర రచించిన పద్యాలు ప్రచురింపబడినవి. ఖడీబోలీలో అతను పద్యరచనచేసే సమయంలో, ఆ భాషలో పద్య రచనకు అవసరమైన లక్షణాలను అడిగి తెలుసు కోవటానికి అతను ఎంతో ఆసక్తి చూపటమే కాకుండా, ఆ భాషను గురించినలోతు పాతులు తెలుసుకోవాలని అన్ని విధాలా ప్రయత్నించాడు,

హరిశ్చంద్రుని హిందీ రచనలు శాఖోపశాఖలుగా వ్యాపించిన విషయం అందరికి తెలిసినదే, కానీ అతను ఉర్దూలో చేసిన కృషి అందరికీ అంతగా తెలి యని విషయం. 1872 వ సంవత్సరం, క్వాసిద్ అనే ఉర్దూ పత్రిక ప్రారంభించా లన్న ప్రయత్నంతో, ఆ విషయమై ప్రకటనలుకూడా చేశాడు. కానీ పాఠకలోకం నుండి తగిన ఉత్సాహం అగుపించనందువల్ల ప్రయత్నం మానుకున్నాడు. ఉర్దూలో అతని పద్యాలు, వచన రచనలు, విమర్శనాత్మక వ్యాసాలు కలిపి అచ్చులో వంద పేజీలకు మించవచ్చును.

అనిస్, దాబీర్ అన్న ఉర్దూ కవులకు మిత్రుడుగా, పోషకుడుగా ఉంటూ, తానుకూడా 'రస' అన్న కలం పేరుతో ఉర్దూలో పద్యాలు రచించాడు. అతని గజల్స్‌కూడా చెప్పుకోదగ్గ స్థాయి నందుకున్నవి. అమీర్ అలీ అనే కవి అతని దేవిడికి తరచుగా వస్తూఉండేవాడు. హరిశ్చంద్ర రచించిన గులిస్థాన్ - ఇ - పుర్ బాహర్, చమాని స్థాన్ - ఇ - పుర్ - బాహర్ రెండు విజ్ఞానదాయకమైన ఉర్దూ పద్య సంపుటాలు, వివిధ సాహిత్య రంగాలనుండి ప్రశంస లందుకున్నవి.

ఆ కాలంలో వృద్ధిలోకి వస్తున్న ఉర్దూ కవుల, కవయిత్రుల గురించిన వివరాలు ఎప్పటికప్పుడు హరిశ్చంద్ర తెలుసుకుంటూ ఉండేవాడు. 'రూప్ రతన్' అన్న కలం పేరుతో భోపాల్ బీగం రచించిన రచనలలో అతను ఎంతో ఆసక్తి

చూపేవాడు. తన పత్రికలలో ఆమె రచనలు ప్రచురించటమే కాక, కలకత్తానుండి వెల్వడే భారత్ మిత్ర అన్న పత్రికకు తన ప్రశంసా వచనం జతచేర్చి ఆమె రచనలను పంపించేవాడు.

హరిశ్చంద్ర ఉర్దూలోకూడా చక్కని వచన కావ్యాలు రచించాడు. 'పంచవన్ పై ఘూంబర్' 'కుషి' అన్న వ్యాసాలు అందులో చెప్పుకోతగ్గవి. 'క్యానూన్ టజీరట్-ఇ-షావుహర్' అన్న విమర్శనాత్మక రచన భర్తల నడవడికను గురించి వ్రాసిన ఒక వ్యంగ్య రచన. పర్షియన్ పద మిళితమైన ఉర్దూ భాషలో అది రచించి, పర్షియన్ గేయంతోనే ముగింపుకూడా చేశాడు. లక్నోనుండి వెల్వడే హిందుస్థానీ అక్బార్ అనే పత్రిక ఈ రచనను గురించి ప్రచురిస్తూ: భర్తలను అనుమానించే భార్యల గుణగణాలను రచయిత ప్రతిభావంతంగానూ, రసవత్తరంగానూ వర్ణించాడు. రచన వినోదవంతంగా సాగింది. దీనికి జతగా భార్యలకు కూడా ఒక విజ్ఞానశాస్త్రాన్ని రచించమని బాబూ సాహెబ్‌ని మనమిప్పుడు కోరాలి. హరిశ్చంద్ర హిందీ భాషాభివృద్ధికి ఎంతగానో తోడ్పడి హిందీ సాహిత్య లోకంలో విశిష్టస్థానాన్ని సంతరించుకున్నాడనటంలో అతిశయోక్తి లేదు. అతని హిందీ రచనలన్నీ ఉర్దూ భాషలోని కూడా అనువదించాలని ఆశిద్దాము. అలా జరిగినప్పుడు ఉర్దూ పాఠకలోకం ఆశ్చర్య చకితులు కాకమానరు. హరిశ్చంద్ర వంటి సమర్థులు ఉర్దూలో నాటికలు వ్రాయగలిగేతే ఎంతో వెలితి పూరింపబడుతుంది. ఉర్దూ భాషా సంపద పెరుగుతుంది. నీల్‌దేవి, సత్య హరిశ్చంద్ర వంటి నాటికలు ఉర్దూలో లేకపోవటం శోచనీయం.

# 8

హరిశ్చంద్ర అనేక సాహిత్య ప్రక్రియలపైన తన ముద్రను వేసిన గొప్ప సాహితీవేత్త అయినా, హిందీ నాటిక రచనా పురోభివృద్ధికి అతను చేసిన సేవ విస్మరింపరానిది. సాహిత్య రంగంలో అతను చేసిన పదునెనిమిది సంవత్సరాల

నిరంతర కృషిలో స్వీయ రచనలు, మరికొన్ని బెంగాలీ, సంస్కృత, ఆంగ్ల భాషల నుండి అనువాదాలు కలిపి పదునెనిమిది నాటికలు రచించి ఉండవచ్చు.

హరిశ్చంద్రకు నాటకాలలో మక్కువ మెండుగా ఉండేది. నాటకాలు రచించటంలోనే కాకుండా స్వయంగా నాటకాలలో పాల్గొనే సహజ ప్రతిభ కూడా అతనిలో నిబిడీకృతమై ఉన్నట్లుగా చిన్ననాడే తెలియవస్తుంది. వివాహ మైన తరువాత పూరీ జగన్నాథ యాత్రకు వెళ్లినపుడు బుర్ద్వాన్‌లో ఒక బెంగాలీ నాటక గ్రంథం కొన్నారు. వీరి కుటుంబానికి మొదటినుండి బెంగాలులో కొంత దగ్గర సంబంధాలు ఉండటంవల్ల, తనకుకూడా వారణాశిలోని బెంగాలీ స్నేహితులతో పరిచయం ఉండటంవల్లనూ, అతను ఆ నాటకాన్ని సులభంగానే చదవగలిగాడు. బెంగాలీ నాటకంలోని నూతన విధానాలు అతని మనస్సును ఆకర్షించి, అటువంటి రచనలు హిందీలో చేయాలన్న చక్కని వూహకు దారి చూపించింది.

ఆధునిక హిందీ నాటికలలో సీతల్ ప్రసాద్ త్రిపాఠి రచించిన 'జానకీ మన్‌దళ్' మొదటి రచనగా పేరు గాంచింది. రామాయణ కథలోని ఒక ఘట్టం ఇతివృత్తంగా తీసుకొని 1867 వ సంవత్సరంలో రచింపబడ్డ ఈ నాటకం, వారణాశి మహారాజు వారి సమక్షంలో ప్రదర్శింపవలసి ఉంది. ప్రదర్శింపవలసిన రోజుకి లక్ష్మణ పాత్రధారి అనారోగ్య కారణంగా రాలేకపోయాడు. ఆ ప్రదర్శన చూడాలన్న కుతూహలంతో ముందే వచ్చిఉన్న మహారాజు ప్రదర్శన మరొక రోజుకు మార్చవలసిందని సలహా ఇచ్చారు. అప్పటికి 17 సంవత్సరాల ప్రాయం గల హరిశ్చంద్ర అప్పుడే లోకానికి వచ్చి పరిస్థితులను గమనించినమీదట, కొద్ది సమయం ఇస్తే తానే ఆ పాత్రను నిర్వహించగలనని చెప్పాడు. లక్ష్మణుని పాత్ర అంత కొద్దిసమయంలో చేయటం సాధ్యంకాదని వారణాశి మహారాజు అభ్యంతరం చెప్పారు. ఒక అరగంట సమయం ఇచ్చినా తాను సిద్ధంకాగలనని ధైర్యంగా చెప్పాడు హరిశ్చంద్ర. అయినా మహారాజుకు సందేహం వదలలేదు. హరిశ్చంద్రకు ఒక గంట సమయం ఇవ్వబడింది. ఆ సమయంలో నాటకం త్వరలో చదువుకున్నాడు. ఆ పుస్తకంలోని దాదాపు ప్రతి పంక్తి అతను గడగడా వప్పజెప్పేసరికి అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. ఆ పాత్రను అతను నిర్వహించి నాటక ప్రదర్శనను జయప్రదం చేశాడు.

ఇంగ్లాండు పత్రికలు ప్రచురించిన ఈ పై సమాచారంలో కొంత అతి

యోక్తి ఉండటం సహజమే అయినా, హరిశ్చంద్ర అద్వితీయమైన ధారణాశక్తిని, నటనా చాతుర్యాన్ని ఇతర ప్రముఖులు కూడా కొనియాడకపోలేదు.

దాదాపు అదే సమయంలో హరిశ్చంద్ర నాటక రచనకూడా ప్రారంభించటం జరిగింది. అతని ప్రథమ రచన ప్రవాస్ నాటక్, ఇప్పుడది అగుపించకుండా పోయింది. అతని రెండవ నాటకరచన, రత్నావళి అనువాద రచన. అతను తన తొలిపలుకులలో (మనకు లభ్యమైనది అది ఒక్కటే) ఇలా వ్రాశాడు: 'వివిధ విషయాలను గురించి హిందీలో పుస్తకాలు చాలా తక్కువగా ఉన్నవి. భాషా పటుత్వానికి పట్టుకొమ్మలు హిందీ నాటకాలు. ఆ లోపం తీర్చటానికే హిందీ నాటకాలను నేను అనువదించ దలచాను. శకుంతల తరువాత రత్నావళి చదువ ఇంపైన పుస్తకాలని నా అభిప్రాయం. అందువల్లనే, నేనీ అనువాదం చేపట్టాను .... తరువాత అనువాదాలు మరికొన్ని చేయదలచాను.'

హరిశ్చంద్ర తరువాత వ్రాసిన నాటకం జతీంద్రమోహన్ ఠాకూర్ బెంగాలీ నాటకానుసరణగా చెప్పుకోబడే విద్యాసుందర్.

1870 వ సంవత్సరం, హరిశ్చంద్ర నాటకాలు వ్రాస్తున్న సమయంలోనే ప్రెస్టోన్ జీ ఫ్రాంజీ ప్రప్రథమ నాటక సంస్థ రూపొందింది. ఏడు సంవత్సరాల తరువాత, ఢిల్లీ నివాసి కురోపిద్ జీబాలీవాలా, విక్టోరియా థీయట్రికల్ కంపెనీ ప్రారంభించాడు. (ఈ సంస్థ నాటికలు బ్రిటన్‌లో కూడా ప్రదర్శించబడినవి). కౌవాన్ ఖాటూవ్ ప్రారంభించిన ఆల్ఫ్రెడ్ థియట్రికల్ కంపెనీ కూడా ప్రఖ్యాతి చెందింది. నాటకం కేవలం శ్రవణానందాన్ని, కనుల పండువును కలిగించటమే ధ్యేయంగా పెట్టుకోకుండా నవరస భరితంగానూ, పంచకళా స్వరూపంగానూ రూపొందాలని హరిశ్చంద్ర అభిలషించాడు. అందువల్లనే హరిశ్చంద్ర నాటకాన్ని తన భావ వ్యక్తీకరణకు ధ్యేయంగా పెట్టుకుని రచించాడు. పూర్వ రంగస్థల పద్ధతులు సనాతన నియమాలను పాటిస్తూ ఉండటం వలన దినదినం మారుతున్న సమాజానికి సరిపోవటం లేదని అభిప్రాయపడ్డాడు. పార్సీ రంగస్థలం విజయవంతంగా కొనసాగటానికి కారణాలు హరిశ్చంద్ర గ్రహించగలిగాడు. పార్సీ డ్రామాలలోని వాంఛనీయమైన అంశాలను, మన సనాతన రంగస్థల వాంఛనీయమైన అంశాలతో జతచేర్చి, అట్టి సమన్వయాన్ని ఆచరణలో పెట్టాడు. ఆ విధంగా హిందీ రంగస్థల నిర్వాహకులు, కేవలం పూర్వంవలె నీతిబోధలపైన మాత్రమే

దృష్టి కేంద్రీకరించకుండా పార్సీ రంగస్థల పద్ధతులను కొన్నింటిని అనుకరించి, పాత్ర పోషణ విషయంలో శ్రద్ధ చూపటం ప్రారంభించారు.

భారతేందు సాధారణంగా నాటకాలకుగాను రచించే పద్యాలను సున్నితమైన బ్రజ్ భాషలోనో, అవధీలోనో కొనసాగించినప్పటికీ మొదటిసారిగా, నాటకాలలో సామాన్య వాడుక భాష అయిన, ఖడీబోలీని ప్రవేశపెట్టాడు. నాటకాలలోని బ్రాహ్మణ పాత్రధారులకు సంస్కృత పదాలను ఎక్కువగా ఉపయోగించి, సామాన్య పాత్రధారులకు మాత్రం, వాడుకభాషను ఉపయోగించాడు. ఆ విధంగా నాటక రచనలో సహజత్వాన్ని సాధించగలిగాడు.

భారతేందు అన్ని విషయాలలోనూ సర్వ సమాన్య మార్గాన్నే అనుసరించాడు. కాలానుగుణంగా లేని పద్ధతులను, కథావస్తువులను త్రోసిపుచ్చేవాడు. ఆనాటి విధానాలకు అనుగుణంగా ఉండే నూతన విధానాలను ఆహ్వానించాడు.

భారతేందు హరిశ్చంద్ర అనారోగ్యంగా ఉన్న సమయంలో, అవసాన దశలో రచించిన విశిష్ట రచన "నాటక్". నాటకం కూడా సాహిత్యంలో ఒక ముఖ్య విభాగమేనని ఈ గ్రంథంలో భారతేందు సూచించటం జరిగింది.

హరిశ్చంద్ర నాటక్ గ్రంథంలో నేటి నాటికల పురోగమనానికి కారణమైన ఆంగ్ల నాటకాలను గురించి, బెంగాలీ నాటకాలను గురించి ప్రస్తావించాడు.

భారతేందు నాటక రచనకు పురాతన, చారిత్రక, సాంఘిక విషయాలను ఆధారంగా చేసుకొన్నప్పటికీ, సమకాలీన సమాజ చిత్రణ చేసినప్పుడు అతను అవలంబించిన మార్గం హిందీ నాటక రచనకు కొత్త ఒరవడిని సంతరించి పెట్టింది. అందులో ముఖ్యంగా, విధవా వివాహాలు, మాంసాహార నిషేధం, సంస్థానాలలోని అరాచకాలు, భారతదేశ ఉత్పత్తిని బ్రిటన్ దేశాభివృద్ధికి వినియోగించజూడటం మొదలైన విషయాలు చర్చింపబడ్డాయి. దేశంలోని, సమాజంలోని దురాచారాలను, అవినీతిని నిర్భయంగా చాటడానికి, అతను జంకలేదు. హరిశ్చంద్ర ఆదర్శాలకు అండగా సన్నిహితులు, ప్రతాప్ నారాయణ్ మిశ్రా, భద్రీనారాయణ్ చౌదరి (ప్రేమ్‌ఘున్), బాలకృష్ణ భట్టా, కూడా ఆనాటి సమాజ పరిస్థితులను గురించి రచించిన వారే.

హరిశ్చంద్ర హిందీ నాటకానికి ఆధునికతను ఆపాదించాడు. మర్చెంట్ ఆఫ్ వెన్నిస్ నాటకాన్ని దుర్లాభ్ బంధూ అన్న పేరుతో స్వేచ్ఛానువాదం చేశాడు. అందులోని పాత్రలు, పోర్షియాకు పుర్ శ్రీ అనీ, షైలాక్‌కి శౌలాక్షు ఆనీ, బసాని యోకి వసంత్ అనీ (హిందూ) పేర్లు పెట్టాడు. అదేవిధంగా బెంగాలీ నుండి విద్యాసుందర్, భారత్ జనని అన్న అనుకరణలు ప్రచురించాడు. సంస్కృత నాటకాలనుండి కూడా అతని అనువాదాలు, అనుకరణలు వెల్వడినవి. ఇందు లోనివే సత్య హరిశ్చంద్ర, చంద్రావళి, ముద్రారాక్షస, రత్నావళి, ధనంజయ విజయ, కర్పూర మంజరి, పాఖండ్ విడంబన్ మొదలైనవి. సత్యానికి అసత్యానికి జరిగే నిరంతర పోరాటాన్ని ఆధారంగా చేసుకొని రచించినదే అతని ప్రసిద్ధ సత్య హరిశ్చంద్ర నాటకం. ఈ పురాణ కథలోని రాజు సత్యమార్గంలో నడవ టానికి ఎన్నో అవరోధాలను ఎదుర్కొని, అష్టకష్టాలను అనుభవింపవలసి వస్తుంది. తన ఆదర్శాన్ని నిలుపుకోగలందులకు అతను సర్వస్వాన్నీ కోల్పోయి, ఒంటరి వాడుగా మిగులుతాడు. కోపానికి మారు రూపమైన ఋషి విశ్వామిత్రుడు. హరి శ్చంద్రుని కష్టాలన్నింటికీ మూలకారకుడు. హరిశ్చంద్ర, విశ్వామిత్ర అన్న యీ రెండు పాత్రలూ మానవ సామాన్యమైన విషయాలకు లొంగినవారుగా గాక, మానవాతీతమైన సత్య నిరతి, దానిని విచ్ఛిన్నం చేసే దుష్టశక్తి అన్న రెండు చిహ్నాలుగా సూచించబడినవి. హరిశ్చంద్ర ఈ పురాణ గాథను అతి నైపుణ్యంతో, రసవత్తరంగా, శక్తివంతంగా మలిచాడు.

మరొక పురాణ గాథ చంద్రావళి నాటకంలో సర్వ ప్రపంచాన్నీ రక్షించే అనంత ప్రేమ స్వరూపుడుగా కృష్ణుని సాక్షాత్కరింపజేస్తాడు. మానవ జీవన స్రవంతిలోని, శోకాన్ని అధిగమించి, ధర్మసిద్ధి కొరకు నిరంతరాన్వేషిణిగా చంద్రావళి రూపుదిద్దుకుంటుంది.

ప్రేమ్‌జోగిని లోని ప్రత్యేకత మరొక మలుపు తిరిగింది, హరిశ్చంద్ర ఆ కాలంలో వారణాశిలోని పరిస్థితులకు అద్దం పట్టినట్లుగా వర్ణిస్తాడు. కళావంతుల గురించి పేర్కొంటూ, వారు తరచు తన దర్బారుకు వచ్చేవారనీ, తనకు వారితో సన్నిహిత సంబంధం ఉండేదనీ, తన రచనలు వాస్తవానికి దగ్గరగా ఉండటానికి ఆ మార్గం పట్టాననీ సమర్థించాడు. ప్రేమ్‌జోగిని రెండు భాగాల సీరియల్‌గా రెండు ఫొటోగ్రాఫులు, మంచి, చెడ్డ లేక నిష్పక్షపాతం అన్న పేరుతో ప్రచురింప బడ్డవి. ఆనాటి భారతదేశ దుస్థితిని భారత్ దుర్దశ అన్న పేరుతో ప్రచురించాడు.

ఆ నాటికలో 'అనారోగ్యం', 'పేదరికం', 'అవివేకం' 'త్రాగుబోతుదనం', 'సోమరితనం' అన్న దురలవాట్లకు రూపకల్పన చేసి పాత్రలుగా పొందుపరచాడు. ప్రేక్షకులలో ఆత్మ పరీక్షకు ఆస్కారం కలిగించే తీరులో, పదునైన భాషలో 37 పేజీల ఈ నాటిక రూపొందింది.

ఇటువంటి ప్రస్తావనే మరింకొక నాటిక "అంధేర్ నగరి"లో తేబడింది. దేశ దేశ దౌర్భాగ్యస్థితిని ఇందులో విమర్శించటం జరిగింది. "నీల్ దేవి" లో కూడా దుర్దశకు ఆవేదన వ్యక్తపరుస్తాడు. చరిత్రాత్మకమైన ఈ నాటికలో హరిశ్చంద్ర భారత మహిళల పురోగమనం గురించి చేసిన హెచ్చరిక వినబడుతుంది. అతను తన తొలివచనంలో ఈవిధంగా ఆక్రోశిస్తాడు: "క్రైస్తవులకు అతి ముఖ్యమైన క్రిస్టమస్ పండుగనాడు, నా మనస్సు ఆవేదనతో నిండి ఉంది. బ్రిటనులో స్త్రీలు పురుషులతోపాటు స్వతంత్రంగా, సంతోషపూర్వకంగా కలిసిమెలిసి ఒకే స్థాయిలో తిరుగుతుండగా, వారితో మన భారత స్త్రీలను పోల్చి చూసుకుంటే నాకి విచారం కలుగుతుంది, అలాగని మన భారత స్త్రీ సహజ సుగుణాలను, నమ్రతను విస్మరించ వలెనని నా అభిమతం కాదు. అయితే, వారి గృహకృత్యాలు చురుకుగా చేసుకోవటం తమ బిడ్డలను విద్యావంతులుగా చేయగల విజ్ఞానం సంపాదించటం, సమాజానికి, దేశానికి ఏది శ్రేయోదాయకమో తెలుసుకోగల శక్తివంతులు కావటం ఎంతైనా అవసరమంటాను .... భారత స్త్రీలు తమ కుటుంబం నాలుగు గోడల మధ్య చెలరేగే స్వల్ప విషయాలనుండి బయటపడి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను తలపెట్టవలసి ఉంది. అలా ముందంజ వేసే పూర్వం, సనాతన మూఢాచారాల అడ్డుకట్టలను తొలగించుకోవాలి. ఒక్కమారు, వెనుదిరిగి చూసుకుంటే, ఆర్యుల కాలంలో మన భారత మహిళలు ఇంత దుస్థితిలో లేరని బోధపడుతుంది, ఆనాటి మహిళలు ఉన్నత స్థానాల నలంకరించారు. విజ్ఞానసంపన్నులై ఉన్నారు. ఈ మధ్యకాలంలో ఆవరించిన చీకట్లను తొలగించటానికే నేనీ నాటికను రచించ దలిచాను. దీనిని వారి హస్తాలలోనే ఉంచుతున్నాను ... దీనిని పరిశీలించి చూసి, ఆనాటి వీరనారీమణులు చూపిన మార్గాన పురోగించమని మాత్రం ప్రార్థిస్తున్నాను.

ఆనాటి రాజుల ఆస్థానాలలోని అరాచకాన్ని చాటిచెప్పే రచన, "విషస్య విషమౌషధం". ఆనాటి బరోడా రాజు పతనం ఆధారంగా తీసుకొని వ్రాసిన వ్యంగ్యనాటకం ఇది.

వైదిక హింస, హింసా నా భావతి అన్న రెండు రచనలలో, మాంసాహారు ఇను. మద్యం సేవించే వారిని, దుయ్యబట్టటం జరిగింది.

ఆంగ్ల భాషలో కొద్దిపాటి పరిజ్ఞానం సంపాదించినంత మాత్రాన తామే అభ్యుదయవాదులమనీ, పునరుద్ధరణకు కంకణం కట్టుకున్న వారమనీ విర్రవీగే కొందరి పెద్దలను హరిశ్చంద్ర విమర్శించాడు. ఈ విమర్శలు ప్రతిభావంతులైన తన ప్రత్యర్థులను, రాజాశివ్‌ప్రసాద్, 'సితార యే-హింద్', అనుచరులను ఉద్దే సంచి చేసినదేనని విమర్శకుల భావన.

# 9

'విశ్వాసం' అన్న ఆదర్శాన్ని పాటించే కుటుంబంలో హరిశ్చంద్ర జన్మిం చాడు. ఆ సదాచారాన్ని నవజీవితంలో పాటించిన వాడు. భారతదేశం ఆ నాడు విక్టోరియా మహారాణి సర్వాధిపత్యంలో ఉండేది గనుక, భారతీయులు ఆమెను, ఆమె కుటుంబాన్ని గౌరవవిశ్వాసాలతో చూడాలని భావించేవారు. పదకొండేళ్ల ప్రాయంలోనే ప్రిన్సు ఆల్బర్టుని అభినందిస్తూ ఒక పద్యాన్ని రచించాడు. తాను స్థాపించిన పాఠశాలలో ప్రతి యేటా రాణి పుట్టిన దినం పండుగ తప్పనిసరిగా జరిపించే వాడు. ఆ నాడు దీపాలతో ఆవరణ అంతా కనుల పండువుగా ఉండేది. వారణాశిలోని ప్రసిద్ధ పండితులను కూడా పిలువనంపి యువరాజుపైన ప్రశంసా పద్యాలు చెప్పించేవాడు. తరువాత ఆ ప్రశంసా పత్రాలను అచ్చువేయించి యువ రాజుకు బహుమతిగా కూడా పంపించాడు,

బ్రిటిష్ వారి అభిమానాన్ని చూరగొన్నవాడు హరిశ్చంద్ర. వారు అతనిని మునిసిపల్ అధికారిగాను, గౌరవ న్యాయాధికారిగాను గౌరవించారు. న్యాయ విచారణ సంబంధమైన గౌరవస్థానం అతనికి అతి చిన్నవయసులోనే ఇవ్వబడింది. వారణాశిలో ఆటువంటి గౌరవస్థానం ఆక్రమించిన వారిలో అతనే చిన్నవాడు. అతని పత్రికకు పోషకులుగా ప్రభుత్వం అంగీకరించటం కూడా గౌరవ చిహ్నమే.

ఇతర రచయితలవలే కాక హరిశ్చంద్ర లండన్‌లో నివసించే సెంట్ జేమ్సు రాజ గృహంతో పరిచయం ఏర్పరచుకున్నాడు. 1871 వ సంవత్సరంలో చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన జగద్విఖ్యాత ప్రదర్శనకు హరిశ్చంద్ర కానుకలుగా పంపించిన ప్రత్యేక పురాతన వస్తువులకు ధన్యవాదాలు తెలుపుతూ వేల్సు యువరాజు స్వయంగా యోగ్యతాపత్రాన్ని బహూకరించాడు. హరిశ్చంద్ర ఇంగ్లండు మహా రాణితోనూ, యువరాజుతోనూ మాత్రమేకాక, రష్యాలోని జార్‌తోనూ, జర్మనీలోని ఖైజర్‌తోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవాడు. వారందరికీ తన పుస్తకాలు పంపించటం ద్వారా మొదటిసారిగా హిందీ సాహిత్యాన్ని విదేశాలకు వ్యాపింప జేసిన వాడైనాడు. తనకు బాగా పరిచయస్తుడు, తూర్పు దేశపు భాషలతో పరి చయమున్న గార్‌కన్ డిటాస్ వంటి విదేశస్తులకే గాక, హిందీతో పరిచయంలేని విదేశ ప్రముఖులకు కూడా హిందీ భాషా పుస్తకాలను పరిచయం చేశాడు. రష్యా దేశం ఆలోచనా సభలోని సభ్యుడు, సెంట్ పీటర్సుబర్గ్ నుండి వ్రాసిన లేఖనుబట్టి 1870 వ సంవత్సర ప్రాంతంలో తూర్పు దేశ భాషలలో పరిజ్ఞానంగల రష్యా దేశీయులు, హరిశ్చంద్ర రచనలకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చినట్లుగా తెలియవస్తుంది. (బ్రిటిష్ వారి ద్వారా బెర్లిన్‌కు, పీటర్స్‌బర్గుకు పంపించబడిన పుస్తకాలు అంది నట్లుగా ఇండియాలోని గవర్నరుకూ, ఉత్తరప్రదేశ్ గవర్నరుకు వ్రాతపూర్వకంగా వార్త అందింది.)

ఆ నాటి పాలకులకు, వారి కుటుంబాలకు సన్నిహితుడు కాగల చాక చక్యం హరిశ్చంద్రకు ఉండేది. యువరాజు ఇండియాకు రానున్నాడన్న వార్త గానీ, దిగినాడన్న వార్తగానీ అందగానే అతనిపైన ప్రశంసాత్మకమైన కవితలను అల్లేవాడు. మహారాణి హంతకులు పేల్చిన గుండు తప్పించుకున్న సంతోష సమయంలో ఉత్సాహపూరితంగా పద్యాలు కట్టేవాడు. ఆఫ్ఘనిస్థాన్, బర్మా, ఈజిప్టు ప్రాంతాలలో బ్రిటిష్ సైన్యం (భారత దేశీయులు) విజయాన్ని సాధించిందన్న వార్త వినగానే ఆనందోత్సాహాలతో రచనలు చేసేవాడు. సమయానుకూలంగా, సందర్భానుసారంగా అతను రచనల ద్వారా ప్రశంసలు కురిపిస్తూనే ఉండేవాడు. వారణాశి విచ్చేసిన రాజకుటుంబీకులతో ఎల్లప్పుడూ స్నేహపూర్వకమైన పరిచయం తోనే మెలిగేవాడు. అటువంటి సదవకాశాలను ఎన్నడూ జారవిడిచే వాడు కాదు. హరిశ్చంద్ర ఈ విధంగా అధికారులతో సాంగత్యం పెంచుకోవటం రాజా శివ ప్రసాద్ 'సితార్-యే-హింద్'కూ, అతని సహచరులకూ, కంటకప్రాయంగా

ఉండేది. వారు (రాజు అతని స్నేహితులు) హరిశ్చంద్ర రచనలకు, కార్యకలాపాలకు విపరీతార్థాలు తీసి, దుష్ప్రచారం చెయ్యటంలో సాయశక్తులా పాటుపడే వారు. విదేశాలనుండి వారణాశికి అతిథులు వచ్చిన సందర్భాన్ని అదనుగా తీసుకొని భారతీయుల దుస్థితిని, వారిపై జరుగుతున్న దమనకాండను ఎత్తి చూపటానికి ప్రయత్నించిన తన ప్రత్యర్థుల పన్నాగాలను హరిశ్చంద్ర వమ్ముచేస్తూ దానికి వ్యతిరేకమైన ప్రదర్శనలు చూపేవాడు. ఎదుటివారి ఆట కట్టించి, ఆడించటంలో హరిశ్చంద్ర సిద్ధహస్తుడు గనుక, ఆ సదవకాశాన్ని విడవకుండా ప్రత్యర్థులను ఆటపట్టించి ఆనందించేవాడు. తన పూర్వీకుల భవనంలోని హాలులో ఆర్భాటంగా నిలబడి, ఎదుట ఇరుకు సందులనుండి వెళ్లే విరోధులపైన ఛలోక్తులు విసిరేవాడు. అందులో కొన్ని వినోదవంతంగా వున్నా, కొన్ని తన ప్రత్యర్థులపైన, వారి సంస్థలపైన విమర్శనాత్మకమైన ఆక్షేపణలుగా చెలరేగేవి. ఆ విమర్శలు కొందరికి అతనిపైన విరక్తిభావం కలిగించేవి. అతను సంపన్నుడు కావటంవల్ల అతని మాట చలామణి అయ్యేది. అతని ప్రత్యర్థుల విమర్శలను తన పత్రికాముఖంగా సూటిగా ఎదుర్కోగల సమర్థుడు హరిశ్చంద్ర. అతని విమర్శలు కొన్ని సుషుప్త్యావస్థలో మునిగివున్న ప్రజలకు ఉత్తేజాన్ని కలిగించే మేలుకొలుపులై భుజం తట్టేవి. భారతదేశ ప్రజలు విదేశాలలోని పారిశ్రామిక విధానాలను గమనించి భారత పరిశ్రమలను అభివృద్ధిపరచడానికి గాను విదేశాలు పర్యటించాలని ప్రబోధించాడు. భారతదేశ సౌభాగ్యం నానాటికి క్షీణిస్తుందని సూచించినవాడు హరిశ్చంద్ర. 1870 లో విదేశ వస్తువులను నిషేధించాలన్న ఉద్యమం అతను ప్రారంభించాడంటే ఆశ్చర్యకరమైన విషయం. స్వాతంత్ర్యోద్యమ ప్రారంభానికి ముప్పది సంవత్సరాల పూర్వమే హరిశ్చంద్ర ప్రజలను స్వదేశీ వస్తువులను మాత్రమే వాడవలసిందని ప్రమాణాలు చేయించాడు. మన దేశం ఆర్థికంగా పారిశ్రామికంగా వెనకబడి ఉండటానికి కారణం శాస్త్రీయంగా పురోగమించక పోవటమేనని హరిశ్చంద్ర చంద్రిక పత్రిక ద్వారా విశదీకరించాడు. భారత దేశం, విదేశాలతో పోల్చి చూచుకొని శాస్త్ర పరిజ్ఞానంలోనూ, యంత్రకర్మాగారాల అభివృద్ధిలోనూ కృషిచేసి దేశాన్ని ప్రగతి పథాన నడిపించాలని ప్రబోధించాడు, వంద సంవత్సరాల వెనుకటి అతని రచనలలోని బీజం ఈనాటికి అదే దశలో ఉంది.

బ్రిటనునుండి వచ్చిన విదేశీయులు దేశీయ ఉత్పత్తిని కొల్లగొట్టుకొని పోయి తమ భాగ్యాన్ని పెంపొందించుకొంటున్నారని విమర్శించాడు. భారతీయులందర్నూ

ఏకమై, సామాన్య మానవుని స్థితిగతులను మెరుగుపరచాలని కూడా నొక్కి వక్కాణించాడు,

బ్రిటిష్‌వారు హరిశ్చంద్రుని విధానాలను భరించే సహనాన్ని అనతికాలం లోనే కోల్పోయారు. దానికి ప్రతిఫలంగా అతని పత్రికలకు పోషకులుగా ఉండటం మానుకున్నారు. అప్పుడు హరిశ్చంద్ర తనకు తన పత్రికా పాఠకులే శరణ్యమని పత్రిక పరిస్థితిని వారికి వివరించి చెప్పాడు. స్థానిక అధికారుల ప్రవర్తనకు నిరసనగా హరిశ్చంద్ర మునిసిపల్ అధికార పదవికి, గౌరవ న్యాయాధికారి పదవికి రాజీనామా ఇచ్చివేశాడు. అప్పుడు అతనికి పట్టుమని పాతికేళ్లయినా లేవు.

హరిశ్చంద్ర బ్రిటిషు ప్రభుత్వానికి విశ్వాసపాత్రుడుగ కడవరకు నిలిచాడు. స్వామిద్రోహి అన్న నింద భరింపరానిదని హరిశ్చంద్ర భావించాడు. తనకు వచ్చిన ఈ అపనిందను పోగొట్టుకోవడానికి ఇతను చివరివరకు ఎన్నో సాక్ష్యాలను చూపుతూ వచ్చాడు. 1870 ప్రాంతాలలో నమ్మకం దేశాభిమానంలో ఒక భాగంగా పరిగణింపబడేది.

బ్రిటిషు వారిపట్ల ఎక్కువ విశ్వాసపాత్రుడుగా పరిగణింపబడే 'సితార-యే-హింద్' అనబడే రాజాశివప్రసాద్‌కు అతని అనుచరులకు, హరిశ్చంద్రకు అతని అభిమానులకు మధ్య హిందీ భాష ప్రచారార్హతను గూర్చి భేదాభిప్రాయాలు తీవ్ర రూపాన్ని దాల్చినవి. బ్రిటిషు పాలనలో అనేక పదవుల్లో ఉద్యోగాన్ని నిర్వహించి, అప్పటికి విద్యాశాఖలో ఒక ప్రముఖ వ్యక్తి అయిన రాజా, హిందీలో కొన్ని వాచకాలను వ్రాశాడు. నిజానికి ఈ వాచకాలలోని భాష హిందీ కాదు. కాని దేవనాగర లిపిలో వ్రాయబడ్డ ఉర్దూ భాష. ఆ హిందీ భాషపైన విమర్శలు గంభీర రూపం దాల్చినవి. సర్వసామాన్యంగా కొందరి పెద్దల గురించి హరిశ్చంద్ర చేసిన విమర్శలు "కవివచన్ సుధ", "హరిశ్చంద్ర చంద్రిక"పత్రికలలో వెల్వడినవి. రాజా అతని బలగం ఆ విమర్శలు తమ గురించి వ్రాసినవేనని అభిప్రాయపడ్డారు. ఆ రచనలకు అపార్థాలు కూడా తీసి, ఇండియా గవర్నర్ _ జనరల్, యు. పి. గవర్నర్, ఆ మాటకివస్తే బ్రిటిష్ సామ్రాజ్యం, రాజవంశీయులందరూ కించపరచబడ్డారని ప్రచారం సాగించారు. ఆ అపవాదులు బ్రిటిష్ అధికారులకు కూడా చేరవేయటం జరిగింది. భారతీయులంతా, తమకు

విధేయులుగా ఉండాలని భావించే బ్రిటిష్ అధికారులకు ఈ పరిణామాలు బొత్తిగా నచ్చలేదు. వారు తమకు ఇష్టుడైనరాజాశివప్రసాద్ 'సితార-యే-హింద్'ను ఇచ్చ కపు మాటలను సమర్థించారు. ప్రత్యర్థుల ప్రచారాల ఫలితంగా కవివచన్ సుధ పత్రికకు లభించే ఆదరణ కూడా ఆగిపోయింది. లాభాలు లేకపోగా అప్పటికే ఎగుడు దిగుడుగా నడుస్తున్న ఆ పత్రిక, పూర్తిగా దివాలా తీసింది. నష్టభారం భరించలేక, హరిశ్చంద్ర ఆ పత్రికను తన స్నేహితునికి ఇచ్చివేయటం జరిగింది. "బాలబోధినికి"కూడా సహాయం అందకపోవటంవల్ల అది కూడా మూసివేయవల సిన అగత్యమేర్పడింది. హరిశ్చంద్రకు ఈ పరిస్థితులు చాలా బాధ కలిగించినవి. ఈ పత్రికను మూసివేయటం అతనికి మనస్కరించక, కవివచన సుధ కొత్త సంపాద కునితో సంప్రదించి, బాలబోధినిని కూడా కవివచన సుధతో అనుబంధ పత్రికగా తీసుకోవలసిందిగా కోరాడు. పేరుకు ఆ విధంగా జరిగినప్పటికీ బాలబోధిని రూపు మాసిపోయింది. చివరికి కవివచన్ సుధ కూడా రాజాశివప్రసాద్ ఆధ్వర్యంలో నడుపబడింది. ఆ పత్రికా స్థాపకుని పైననే ఆ పత్రిక దండెత్తవలసిన అగత్యం పట్టటం శోచనీయం.

చివరికి మిగిలిన హరిశ్చంద్ర చంద్రిక కొంతకాలం నడిచిన తరువాత, మోహన్ చంద్రిక అన్న పత్రికను ప్రారంభించిన హరిశ్చంద్ర మిత్రుడు హరి శ్చంద్రను కలుసుకొని, పేరు ప్రఖ్యాతులు గడించిన హరిశ్చంద్ర చంద్రికను తన పత్రికతో కలపవలసినదిగా కోరాడు, ఆ రెంటి సమ్మేళనమే హరిశ్చంద్ర మరియు మోహన్ చంద్రికగా రూపొందింది. కొంతకాలానికి మోహన్‌లాల్ విష్ణులాల్ పాండ్యకు ఉద్యోగం దొరకటంవల్ల, పత్రిక కూడా వారణాశినుండి ఉదయ్‌పూర్‌కు మార్చబడింది. ఆ తరవాత నధడ్‌వారాకు మారి, రాజస్థాన్ ఎడారిలో రూపు రేఖలు లేకుండా మాసిపోయింది,

హరిశ్చంద్ర గతించే కొద్దికాలం ముందు తనకు అతిప్రియమైన చంద్రికను నవోదిత చంద్రిక అన్న పేరుతో తిరిగి ప్రారంభించాడు. ఎంతో కాలం తిరగక ముందే అతను కన్ను మూశాడు. అతని బంధువులు ఆ పత్రికను కొనసాగించే వీలులేదని యం. వి. పాండ్య ఆభ్యంతరపరచాడు.

# 10

హరిశ్చంద్ర ఎందరినో విమర్శించాడు, ముఖ్యంగా భారతదేశ క్షేమాన్ని విస్మరించి హిందీ భాషాభివృద్ధిని మరచి బ్రిటిష్‌వారి ఆదేశాలను గుడ్డిగా అనుసరించే వారిపైన గట్టి దెబ్బతీశాడు. అయినప్పటికీ, హిందీ భాషాభివృద్ధికి హరిశ్చంద్ర చూపిన నూతన విధానాలను అతని విరోధులు కూడా నిరాకరించలేరు. హిందీ పత్రికా ప్రచారానికి అతను మార్గదర్శి. కవివచన్ సుధ, హరిశ్చంద్ర చంద్రిక, ఈ రెండు పత్రికలు మరెన్నో పత్రికలు ప్రారంభించటానికి మూల కారణమైనవి. ఈ పత్రికలకు ముందుగా వ్రాసిన రచయితలు తరువాత కొత్త పత్రికలను ప్రారంభించటం జరిగింది. వారందరికీ హరిశ్చంద్ర మార్గదర్శి.

ఈ రెండు పత్రికలు, తదితర విషయాలతోబాటు సాహిత్యంలో హాస్యాన్ని ప్రోత్సహించినవి. హాస్యస్ఫోరకంగా తేలికగా (సరళంగా) రచనలు కొనసాగించటం, నిజానికి ఆ నాటి పత్రికారచనా లక్షణమయినది. హరిశ్చంద్ర తరువాత, మనస్సుకు ఆహ్లాదం కలిగించే రీతిలో రచనలు సాగించిన వారు కాన్పూరుకు చెందిన ప్రతాప్‌నారాయణ మిశ్రా. అతని స్వగ్రామమైన ఉన్నోజిల్లా మాండలిక పదాలను రచనలో చిత్రంగా పొందుపరచి మనోరంజకంగా రచించేవాడు. బాలకృష్ణ భట్ రచనలలో కూడా సున్నితమైన, సొంపైన హాస్యధోరణి తొణికిసలాడి పాఠకుల ఆసక్తికి పాత్రమయ్యేది.

హిందీ పత్రికా వికాసంవలెనే, భారతేందు నాటికలు కూడా అతని రచనలతో సన్నిహిత సంబంధాలు గల అనేక రచయితలకు మార్గం చూపించినవని చెప్పక తప్పదు. ఉదాహరణకు, ప్రతాప్‌నారాయణ్ మిశ్రా, భారత్ దుర్‌దశ, కాళీ కౌతుక్ రూపక్, హఠీ హమీర్ మొదలైన అనేక నాటికలు రచించాడు. పండిత బాలకృష్ణ భట్ బాల్‌వివాహ్, కాలీరాజ్‌కి సభా, రైల్ కా వికట్ ఖేల్ వ్రాసినవాడు. పండిత బద్రీనారాయణ్ చౌదరి 'ప్రేమ్ ఘున్' కూడా భారత్ సౌభాగ్య, ప్రయాగ్ రామగమన్, వారాంగన రహస్య నాటక్ వంటి నాటికలు రచించాడు. లాలా శ్రీనివాస దాస్ ప్రహ్లాద చరిత్ర, సంజోక్త స్వయంబార్, తప్త

సమవరన్ మొదలైన అనేక నాటకాలు వ్రాశాడు. భారతేందు దగ్గర బంధువైన బాబూ రాధాకృష్ణదాస్ హరిశ్చంద్ర అసంపూర్ణంగా వదలిన రచనలను పూర్తి చేయటమేకాక తాను స్వయంగా దుఖినీ బాల, మహారాణా ప్రతాప్ వంటి నాటికలు కూడా రచించాడు.

భారతేందుతో పరిచయం పెంచుకున్న రచయితలు నాటికలు రచించటంలో ఆసక్తికలిగి ఉండటమే కాక, వివిధ రచయితల రచనలలోని సాహిత్య విలువలను గురించి విమర్శనాత్మక చర్చలు జరపటం, సాహిత్య విలువల గురించి, సాహిత్యాభివృద్ధిని గురించి చర్చించటం, సాహిత్య విలువలకు జోహారు లర్పించటం వంటి కార్యక్రమాలలో నిమగ్నులై ఉండేవారు.

ఇదివరకే మనం పరిశీలించిన విధంగా భారతేందు అనేక వృత్తాలలో పద్యాలు రచించటమే గాక భక్తిత్వత్త్వాన్ని అనేక భావనారీతులలో, పరిశోధించి చూశాడు. విజ్ఞాన దీపికగా వెలుగొందుతున్న బెంగాలీ సాహిత్య వైఖరిని హిందీ సాహిత్యంలోకి మళ్లించిన ఘనత అతనిదే. నూతనత్వం ఏ మారుమూలల ఉన్నా అతని దృష్టినుండి మరుగుపడేది కాదు. నిజానికి అతనికి దూరదృష్టి అపారం - విదేశాలవైపు, భవిష్యత్తులోకి కూడా అతని దృష్టిని సారించాడు. ఫ్రెంచి – జర్మన్ దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనపుడు, ఆ విషయాన్ని గురించిన రచనలను అతను ప్రోత్సహించి, పారితోషికం కూడా ప్రకటించాడు.

హరిశ్చంద్ర స్త్రీ విద్య, విధవా వివాహాల వంటి సంఘ సంస్కరణోద్యమాలను గురించీ, సముద్ర ప్రయాణాలను గురించీ రచనలు చేశాడు. మద్రాసు, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల నుండి ఉత్తీర్ణులైన బాలికలకు చీరలు బహూకరించే వాడు. బహుభార్యాత్వాన్ని, బాల్య వివాహాలను నిషేధించాలన్నాడు.

హరిశ్చంద్ర జగన్నాథ స్వామి దర్శనానికి పూరీ వెళ్ళే దారిలో బుర్ద్వాన్ వెళ్ళినపుడు చేసిన రైలు ప్రయాణమే బహుశా అతని మొదటి రైలు ప్రయాణం కావచ్చును. ఆ తర్వాత అతను తూర్పు, పడమర, ఉత్తర భారతదేశాలు అనేకమార్లు పర్యటించి వచ్చాడు. ఈ పర్యటనల ఫలితంగా విశాల భావాలు అతనికి అబ్బినవి. ఖండేష్‌లోను, గుజరాత్‌లోను వరదబాధితుల సహాయార్థం తన

పత్రికద్వారానూ, స్వయంగానూ కూడా విరాళాలు పోగుచెయ్యటం అతనికి భారత దేశంపట్ల ఉన్న విశాల దృక్పథానికి నిదర్శనం. హరిశ్చంద్రుని వివిధ ప్రాంతాల పర్యటనా ఫలితమే హిందీలో ప్రప్రథమంగా అతను రచించిన యాత్రాచరిత్రలు. అవసానదశలో అతని అస్వస్థతకు కారణమైన పర్యటన ఉదయ్‌పూర్ ప్రయాణం. వివిధ ప్రాంతాలలో పర్యటించాలన్న అతని వాంఛయే ఆ పర్యటనకు దారితీసింది.

సంపన్నులైన యువరాజులకు, జమీందారు బిడ్డలకు స్థాపించబడిన ఒక విద్యాసంస్థలో రాజేంద్రలాల్ మిత్ర అనే వ్యక్తి పురాతన వృత్తాంతాల సంగ్రహ కర్తగా ఉండేవాడు. అతను హరిశ్చంద్ర ఇంటికి దగ్గరగా నివసించేవాడు. ఇద్దరూ విష్ణుభక్తులై కావటంవల్ల సన్నిహితులైనారు. హరిశ్చంద్రకు అతని పరిచయం వల్ల ప్రాచీన వస్తువుల పైన శాస్త్రీయమైన పరిశోధనల పైన ఆశక్తి కలిగింది. హరిశ్చంద్ర ప్రాచీన వస్తుచరిత్రను హిందీ సాహిత్యంలో ప్రప్రథమంగా ప్రారంభించాడు. పరిశోధన చేసే విద్యార్థివలె అతను వారణాశి అంతా ప్రయాణం చేసి ప్రాచీన దేవాలయాలను గురించీ, అక్కడి రాగిపలకల వృత్తాంతాలను గురించి విపులంగా వ్రాశాడు. కలకత్తా వెళ్ళినప్పుడు, తప్పనిసరిగా ఆసియా సంఘాన్ని సందర్శించేవాడు. ఎన్నో వ్రాతప్రతులను ఆ సంఘానికి సమర్పించాడు.

వివిధ కాలాల భారతదేశ చరిత్ర హరిశ్చంద్ర వ్యాసాలుగా రచించాడు. హిందీ సాహిత్యానికది నూతనాంశమే. చరిత్రను గురించిన వ్యాసాలు వ్రాసే టప్పుడు, లభించినంతవరకు దానికి సంబంధించిన సాహిత్యమంతా అతను క్షుణ్ణంగా చదివేవాడు. అతని తరువాత రచనలలో సుప్రసిద్ధ బ్రిటిష్, ఫ్రెంచ్ చరిత్రకారుల రచనలలోని విషయాలు కూడా పొందుపరచబడినవి. కాశ్మీరు చరిత్ర (కల్హణుని రాజ తరంగిణిని ఆధారంగా చేసుకొన్నది) వంటిది. ఉదయపూర్ రాజభవనం గురించిన చరిత్ర, రాజస్థాన్‌లోని కోటచరిత్ర సమర్ధవంతంగా రచించిన చరిత్రలని చెప్పవచ్చును. ఈ గ్రంథరచనకు పూనుకునే ముందు అతను టాడ్ రచించిన ఆనల్స్ ఆఫ్ రాజస్థాన్ క్షుణ్ణంగా చదివినట్లు తెలియవస్తున్నది. భారతదేశంలోని అనేక సంస్థానాధీశ్వరులు హరిశ్చంద్రను గౌరవించారు. హిందీ భాషాభిమాని ఉదయపూర్ మహారవాల్ హరిశ్చంద్రను తన ఆస్థానానికి ఆహ్వానించి నట్లుగా తెలియవస్తుంది. (హిందీ రచయితల రచనల ద్వారా. హరిశ్చంద్ర కావ్య రచనాకౌశలం, అపూర్వమైన కవితా దక్షత మహారవాల్‌ను ఎంతగా ముగ్ధుణ్ణి

చేసినాయంటే, ఉదయపూర్‌కి వచ్చిన క్షణం నుండి అతను తన రాజ్యంలో భాగస్వామి అయ్యాడని హరిశ్చంద్రతోనే స్వయంగా అన్నట్లు తెలుస్తుంది.)

"కాలచక్ర" అన్న రచనలో హరిశ్చంద్ర ప్రపంచ చరిత్రను కొన్ని దశలుగా విభజించి క్లుప్తంగా చెప్ప ప్రయత్నించాడు.

హరిశ్చంద్ర భక్తుడయినప్పటికి మూఢభక్తి మాత్రం అతన్ని ఆవరించలేదు. అతను విశాల హృదయంగల వ్యక్తి, లౌకికమార్గం అవలంబించిన వాడుగా చెప్ప వచ్చును. వివిధ మతాలవారూ ఒక్కటేనని చాటి చెప్పినవాడు. అంతేకాక వివిధ వర్గాల కలయికకొరకు కృషిచేసినవాడు. తాను ఒకమారు జైనదేవాలయం సందర్శించిన సందర్భంలో ఎదురైన విమర్శలకు, సమాధానం కర్మశీలతారశ్మిని వెల్లివిరియింపజేసే రచనల ద్వారా తెలియజెప్పాడు. జైన మతంలో నిరసించ దగ్గదేమీ లేదని స్పష్టపరచాడు. ఆర్యసమాజంవారు, వారణాశిలోని మతబోధకులను విమర్శిస్తున్న (1870 వ సంవత్సరం) సమయంలో స్వామి దయానంద సరస్వతికి వ్యతిరేకంగా చర్చలలో పాల్గొన్నాడు. తరువాత కాలంలో స్వామి దయానంద్‌ను తన పత్రికలో (సహాయ సంపాదకునిగా) చేర్చుకోవటం జరిగింది. అతను చివరి కాలంలో రచించిన రచనలలో మత సమన్వయం గురించిన రచనలు ఎక్కువగా వెల్వడినవి—హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులు—అందరూ ముందుగా తాము భారతీయులమని భావించి, సోదరభావంతో ఐక్యతగా మెలగాలని దేశసౌభాగ్యం కొరకు అందరూ కలిసి పాటుపడాలని సమైక్యతాభావాన్ని తన రచనల ద్వారా ప్రబోధించాడు. సనాతనాచారాల సంప్రదాయంలో నడిచే ఆ కాలంలో నూతన అభ్యుదయ మార్గాన్ని తిలకించినవాడు హరిశ్చంద్రుడు.

హరిశ్చంద్ర చేసిన కృషి ఫలితంగానే, పద్యంలో కాకున్నా, వచన రచనలో ఖడీబోలీ ప్రవేశపెట్టబడింది. ఎక్కువ భాగం పద్యరచనలో, ముఖ్యంగా భక్తిగీతాలలో మధురమైన బ్రజ్ భాష వాడబడింది. భారతేందు బ్రజ్ భాషలోనే రచనలు చేసినప్పటికీ, భావికాలంలో ఖడీబోలీ వాడవలసిన అవసరం వస్తుందని ముందే గ్రహించగలిగాడు. పద్య రచన కూడా ఖడీబోలీ భాషలో ప్రయత్నించి చూడటం అతని దూరదృష్టికి దృష్టాంతం. కలకత్తా నుండి వెల్వడే భారత్ మిత్ర పత్రికా సంపాదకునికి తన ఖడీబోలీ పద్యాలు పంపిస్తూ ఈ విధంగా వ్రాశాడు: 'దయచేసి నా పద్యాలను పరిశీలించి చూసి లోపాలు తెలుపగోరుతున్నాను. ఖడీ

బోలీలో చక్కగా వ్రాసే విధానం నాకు తెలుపవలసినది. ఈ భాషకు ఏది అన్వ యిస్తుందో చూడాలన్న ప్రయత్నంలోనే—నేనీ మూడు ఛందములు వాడి చూశాను. నాకు సంపూర్ణమైన సంతృప్తి కలిగిందని చెప్పలేను. బ్రజ్ భాషలో రచించటం కన్నా ఖడీబోలీలో వ్రాయటానికి రెట్టింపు యత్నం, సమయం కూడా తీసుకుంటుంది—కారణం అంతుపట్టలేదు. ఖడీబోలీలో అనేక దీర్ఘాచ్చులు ఉండడం దీనికి కారణం కావచ్చును. మీ సలహాలతో, పాఠకుల ప్రోద్బలంతో ఇటువంటి రచనలు మరికొన్ని చేయదలిచాను.''

హరిశ్చంద్రను ఆకర్షించిన హిందీ సాహిత్య విభాగం మరొకటి కూడా వుంది. అది హిందీ నవల. అతని అభిమానికి లేఖ వ్రాస్తూ: ''హిందీలో కొంత వరకు నాటకాలు వెల్వడినవి, కానీ హిందీ నవలలు మాత్రం వెల్వడలేదు. మీరు కానీ, మీ పత్రికలోని రాధాచరణ్ గోస్వామి కానీ, బాబూ కాశీనాథ్ కానీ హిందీలో నవలలు వ్రాయగలిగితే చాలా మేలు జరుగుతుందని నా నమ్మకం. మీకు వీలుంటే దీప్ నారాయన్ అనువదించవచ్చును. ఈ రచన నవలకన్నా ఉన్నతస్థాయి నందుకొన్నది. ఇందులోని విషయం దేశ సౌభాగ్యానికి సంబంధించి నది'' అని సూచించాడు. హరిశ్చంద్ర తన (బెంగాలీ) రెండవ 'భార్య', వల్లికను బెంగాలీ భాషనుండి నవలలను అనువదించవలసినదిగా కోరాడు. రాధారాణి, సౌందర్యమయి, చంద్రప్రభపూర్ణప్రకాశ్ అన్న మూడు నవలలు ఆమె అనువ దించినది. సమంజసాపూరితంగా రాధారాణి అన్న నవలను తనను ప్రోత్స హించిన హరిశ్చంద్రకే అంకితంగా అర్పించింది. ఆమె తన అంకిత వచనంలో ఈ విధంగా చెప్పకుంది: ''సంఘం, సంస్కారం—ఏ కోణం నుండి పరిశీలించి చూసినా నా రచనలు పాఠకలోకం అభినందించే విశిష్ట స్థానాన్నందుకోలేవు. నిజానికి అనువాదంలో అత్యున్నతమైన విషయం ఏమీలేదు. కాని మహాత్ముడైన నా గురువు ఆదేశంపైన, నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతోనే ఈ రచన చేపట్టాను. ఇది నన్నాదరించిన ఆ గురువునకు సంతృప్తినిస్తే, నా ఈ కృషికి అదే ప్రతి ఫలంగా భావిస్తాను. 'వల్లిక, 'గురువు' ఆ మూడు నవలల అనువాదాలకు ఆర్థిక సహాయం అందించి ప్రచురించాడు.

బంకించంద్ర ఛటర్జీ రాజ్‌సిన్హా అనువాదం హరిశ్చంద్ర స్వయంగా చేపట్టాడు. (దురదృష్టవశాత్తు ఆ రచన అసంపూర్ణంగానే మిగిలిపోవటం వల్ల

అతని బంధువైన రాధాకృష్ణదాస్ దానిని పూర్తి చేయటం జరిగింది.) హరిశ్చంద్ర ఇచ్చిన ప్రోద్బలంవల్లనే రాధాకృష్ణదాస్ 'స్వర్ణలత', పండిత రాంశంకర్ వ్యాస 'మధు మాలతి' అను గ్రంథాలను హిందీనుండి అనువదించారు. అదే విధంగా గదాధర్ సింగ్ దుర్గేశనందిని, కాదంబరి అనే రెండు గ్రంథాలను అనువదించాడు. హరిశ్చంద్ర మరికొన్ని ఏండ్లు జీవించి ఉన్నట్లయితే హిందీ సాహిత్యంలోని నవలా శాఖను సుసంపన్నం చేసి ఉంటాడనటంలో సందేహం లేదు. కాని అది అలా జరగలేదు.

# 11

హరిశ్చంద్ర దుర్వ్యయంవల్ల మనశ్శాంతి, భోగ విలాసతవల్ల ఆరోగ్యం దెబ్బతిన్నవి. అతనికి ఏది శ్రేయోదాయకమో, ఏది ప్రమాదకరమో కనులకు కట్టి నట్లున్నా, ఆ నిజాన్ని అతడు ఎదుర్కోదలచలేదు. దూరభార ప్రయాణాలు అతను మానుకోలేదు. చిరకాల మిత్రుడైన మోహన్‌లాల్ వి. పాండ్య ఉదయపూర్‌లో ఉన్నందువల్ల, తన అనారోగ్య స్థితి కూడా లెక్క చేయకుండా, ఉదయపూర్‌కి, అటునుండి నత్వారాకు వెళ్ళి వచ్చాడు. ఈ పర్యటనలోనే అతని ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. కలరా వ్యాధి సోకి, ఉచ్ఛ్వాస నిశ్వాసలకు కూడా అవరోధం కలిగింది. ఎన్నో ఇబ్బందులకు తట్టుకొని ఆ పర్యటన పూర్తి చేసుకొని తిరిగి రాగలిగాడు. వారణాశికి తిరిగి రాగానే తనకు ప్రాణప్రదమైన రచనలు పూర్తి చేసుకోవాలని ప్రయత్నించాడు భారతీయ రంగపు తీరుతెన్నులను గురించి ఒక గ్రంథాన్ని రచించాడు. బ్రిటిష్ కమిటీవారి కోరికపైన, బ్రిటిష్‌వారి జాతీయ గీతాన్ని హిందీలోకి అనువదించాడు. అతను మరికొన్ని నాటికలను, వచన గ్రంథాలను కూడా రచించాడు. రచనా వ్యాసంగాలతోబాటు తదితర కార్య క్రమాలపట్ల కూడా అతని ఆసక్తి సడలలేదు. అనారోగ్య స్థితి అతనిని నిర్ణీత మార్గంనుండి ఒక్క క్షణంకూడా చలింపజేయలేక పోయింది. బల్లియాలో తాను రచించిన సత్యహరిశ్చంద్ర, నీల్‌దేవి ప్రదర్శింపబడుతున్న సందర్భంగా అక్కడకు

ప్రయాణమై వెళ్ళాడు. అక్కడ అందరి సమక్షంలో షేక్స్పియర్ అంతటివాడని అభినందింపబడ్డాడు. ఆతడున్న పరిస్థితిలో ఆ ప్రయాణం తలపెట్టవలసినది కాదు. తిరిగి వచ్చిన కొద్దికాలానికే అనారోగ్యం తిరుగబెట్టింది. జబ్బు బాగా ముదిరినా వైద్యులు రచననుండి అతని దృష్టిని మళ్లించలేకపోయారు. ఆ సమయంలో కూడా అతను రచన కొనసాగిస్తూనే ఉన్నాడు. కాలక్రమేణ అతని ఆరోగ్యం మరీ క్షీణించిపోయింది. తుదిఘడియలు సమీపించి, 1885 వ సంవత్సరం జనవరి అయిదవ తేదీన పరమపదించాడు. తులసీదాసు తదనంతరం, ఆధునిక హిందీ సాహిత్య ప్రపంచంలో ఉద్భవించిన ప్రతిభామూర్తి అస్తమించాడు. పద్యం, నాటక, పత్రికారచన, వ్యాసం చరిత్ర మొదలైన ఏ రచనా విభాగం ప్రారంభించినా, ఆయా విభాగాన్ని నూతన మార్గంలో నడిపించి, హిందీ సాహిత్యాన్ని మహోన్నత శిఖరాల పైకి తీసుకువెళ్ళి, ఉన్నత స్థానాన్ని అలంకరింపజేసిన మహానుభావుడు హరిశ్చంద్ర. హిందీని ఇతర భారత భాషలకు సన్నిహితంగా తీసుకురావాలని కృషిచేసిన వాడు.

సాహిత్యరంగంలో అంతటి మహోన్నత శిఖరాలనందుకున్నా కొన్ని తీరని కోరికలుగా మిగిలినవి. అతను మిత్రులతో ఇలా అనేవాడు: 'నాకు మాత్రమే పిత్రార్జితమంతా సంక్రమించే అవకాశం అంటూ ఉంటే ఇవన్నీ చేసేవాడను—

1. హిందీ బోధనా భాషగా ఒక విశ్వవిద్యాలయం స్థాపించటం;

2. మా ఉద్యానవనంలో గౌరవనీయులైన ఠాకూర్‌జీ ప్రతిమను ప్రతిష్టించటం;

3. దేశం వాయవ్య మూలలో లలిత కళానిలయంగా ఒక కళాశాలను నిర్మించటం:

4. అమెరికా, బ్రిటన్ దేశాలు సందర్శించటం.

పాపం! అతని ఈ ఆశయాలు సిద్ధించనే లేదు. ఆయినప్పటికీ హిందీ సాహిత్యంలో నాటిక, నవల, వ్యాసం, పద్యం, పత్రికా రచన మొదలైన వివిధ ప్రక్రియలలో పురోగమనానికి మార్గదర్శి అయినాడు. నిజానికి హిందీ సాహిత్యాన్ని భవిష్యత్తులోకి ప్రజ్వలింజేసే ప్రోత్సాహశక్తిని ఎందరో రచయితలకు

1954 లో భారత ప్రభుత్వంవారిచే స్థాపించబడిన సాహిత్య అకాడెమీ పాలనా స్వేచ్ఛగల జాతీయ సంస్థ. వివిధ భారతీయ భాషలకూ, రాష్ట్రాలకూ, విశ్వ విద్యాలయాలకూ చెందిన ప్రతినిధులు గల జనరల్ కౌన్సిల్ ఈ సంస్థ విధానాలను రూపొందిస్తుంది. అకాడెమీ మొదటి అధ్యక్షులు శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ.

భారతీయ భాషలలోని సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహించి సమన్వయ పరిచేందుకూ, ఒక భారతీయ భాషలోని ఉత్తమ సారస్వతమును అనువాద రూపంలో అన్య భారతీయ భాషల వారికి అందించేందుకూ అకాడెమీ కార్యక్రమం ఉద్దిష్టమైనది.

అకాడెమీ ప్రచురణలు ముఖ్యంగా భారతీయ భాషలకే పరిమితం. కాని భారతీయ రచయితలకూ, వారి రచనలకూ సంబంధించిన మౌలిక విషయాలను తెలియజేసేందుకు ఆంగ్లంలో గ్రంథ ప్రచురణ జరుగుతున్నది.

సాహిత్య అకాడెమీ
రవీంద్ర భవన్, న్యూఢిల్లీ-1
ప్రాంతీయ కార్యాలయములు :
మద్రాసు-18, కలకత్తా-29 &
బొంబాయి-14

# భారతీయ సాహిత్య నిర్మాతలు

ప్రాచీన, ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతలను గురించి తెలుసుకోవడం ద్వారా భారతీయ సాహిత్య చరిత్రలోని ప్రధాన ఘట్టాలను సామాన్య పాఠకుడు సైతం గ్రహించవచ్చు.

ఏ భారతీయ భాషలోనైనా దాని అభివృద్ధి వికాసములకు తోడ్పడిన సుప్రసిద్ధ రచయిత జీవిత కథనూ, ఆయన సాహిత్య సేవనూ ఈ శీర్షిక క్రింద ఆంగ్లంలో వెలువడే ప్రతి రచన నుంచి గ్రహించవచ్చు.

* లక్ష్మీనాథ బెజ్ బరువా - హేమ్ బరువా
* రాజా రామమోహన్‌రాయ్ - సౌ. ఠాకూర్
* కేశవసుత్ - ప్రభాకర్ మాచ్వే
ఇళంగో అడిగళ్ - ము. వరదరాజన్
* ప్రేమ్‌చంద్ - ప్రకాశ చంద్ర గుప్త
* ఈశ్వరచంద్ర విద్యాసాగర్ - హెచ్. బెనర్జీ
* కబీర్ - ప్రభాకర్ మాచ్వే
* తోరూదత్ - పద్మినీ సెన్ గుప్త
వేమన - వి. ఆర్. నార్ల
వీరేశలింగం - వి. ఆర్. నార్ల
* గాలిబ్ - యం. ముజీబ్
* మీరాబాయి - ఉషా నిల్సన్
* బసవేశ్వర - H. తిప్పేరుద్రస్వామి
* భారతేందుహరిశ్చంద్ర - మదన్‌గోపాల్
* మానిక్ బందోపాధ్యాయ - సరోజ్ మోహన్ మిత్ర
* జీవనానంద దాస్ - చి. దాస్‌గుప్త
ప్రమథ చౌధురి - ఎ. కె. ముఖోపాధ్యాయ
చండీదాస్ - సుకుమార్ సెన్
* కుమారన్ ఆశాన్ - కె. ఎం. జార్జి
కాజి నజ్‌రుల్ ఇస్లాం - గో. హల్దార్
సరోజినీ నాయుడు - పద్మినీ సెన్ గుప్త
* B.M. శ్రీకంఠయ్య - A. N. మూర్తిరావు
విద్యాపతి - రమానాథ్ ఝా
* వళ్ళత్తోళ్ - బి. హృదయకుమారి
జయదేవ - యస్. కె. చటర్జీ
* కంబన్ - యస్. మహరాజన్
నమ్మాళ్వార్ - ఎ. శ్రీనివాసరాఘవన్
డా. సి. ఆర్. రెడ్డి - డి. ఆంజనేయులు
పోతన - డి. వేంకటావధాని
వేదం వేంకటరాయశాస్త్రి - వి. వి. శాస్త్రి (జూనియర్)
* తారాశ...
* ఫకీర్ ...
* బాణ...

Library IIAS, Shimla
TL 810.409 2 B 469 M
00117649

* ఇవి తెలుగు చేయబడినవి.